RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 230 ISSUE NO : 230 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | ఆదివారం, మార్చి,8, 2026 Sunday, March,8, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-

## ఈ నెలాఖరులోగా
# లక్ష గృహ ప్రవేశాలు




### - గ్రామాల్లో 3.60 లక్షల ఇళ్లు మంజూరు..

**హైదరాబాద్,మార్చి,07,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గూడు లేని పేదల కోసంప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో మొదటి దశ కింద ఇప్పటికే 3.60 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. నిర్మాణదశలో ఉన్న ఇళ్లలో కనీసం లక్ష యూనిట్లను ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేసి..లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించాలనిమంత్రి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అందాల్సిన నగదు చెల్లింపుల్లో జాప్యం జరిగినా లేదా ఎక్కడైనా నిలిపివేసినా సంబంధిత అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి అర్హులైనలబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను కూడా ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వచ్చే ఏప్రిల్ నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ ను ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు.

## ఇరాన్ ఉద్రిక్తతలు...
# పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్రం క్లారిటీ



**న్యూఢిల్లీ,మార్చి,07:**వాహనదారులకు ఊరటనిచ్చే వార్త ఇది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు శనివారం స్పష్టం చేశాయి. ప్రస్తుతం భారత్‌లో ఇంధన నిల్వలు మెరుగుపడుతున్నాయని, పరిస్థితి మరింత స్థిరంగా మారుతోందని, అందువల్ల ధరల పెంపు ఉండదని వెల్లడించాయి. ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ప్రభుత్వ వర్గాలు ఖండించాయి.


## శాంతియుత వాతావరణమమే
# శ్రీరామరక్ష...
## లొంగిన మావోయిస్టులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత
### - 130 మంది మావోయిస్టులు లొంగుబాటు - గణపతి కూడా లొంగి పోవాలన్న సిఎం రేవంత్



**హైదరాబాద్,మార్చి7,తెలంగాణ దిశ :** శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకుఅవసరమైన వసతులు కల్పిస్తాం అని అన్నారు. 130 మంది మావోయిస్టులు శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మొత్తం 124 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ,బడేచొక్కారావు గన్‌మెన్లు కూడాఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మావోయిస్టుల లొంగుబాటుకుఅధికారులు తీవ్ర కృషిచేశారు. పోలీసులు మావోయిస్టుల్లో నమ్మ కంకల్పించారు. దేవ్‌జీ,ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేశా రు. తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారు'. రాష్ట్ర స్థాయిలో మేం చేయగలిగిందంతా చేస్తాం. మావోయిస్టు అగ్రనేత గణపతి కూడా లొం గిపోవాలి. అజ్ఞాతంలో ఉన్న తెలంగాణకు చెందిన ఏడుగురు కూడా.. త్వరగా లొంగిపోవాలి. లొంగిపోయిన వారికి పున రావాసం కల్పించాలని అమిత్‌షా చెప్పారు. లొంగిపోయినమావో యి స్టులకురివార్డు కూడా అందజేస్తాం. ప్రత్యేకమైన ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తాం' అని రేవంత్ రెడ్డి హామీ చెప్పా రు. లొంగిపోయిన మావోయి స్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. మావో యిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తాం. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని అన్నారు.

## ఆయుధాలను అప్పగించిన మావోలు
# లొంగిన వారికి హోదాను బట్టి నగదు ప్రోత్సాహకం

**హైదరాబాద్,మార్చి7,తెలంగాణ దిశ :** తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. ఇప్పటి వరకు తెలంగాణ పోలీసులు ముందు 721 మంది మావోయిస్టులు లొంగిపోయారు. మావోయిస్టుల నుంచి పోలీసులు ఇప్పటి వరకు 266 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి 7 మంది మావోయి స్టులు అజ్ఞాతంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. 124 తుపాకులు, 5205 తూటాలతో సహా మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. మావోయిస్టులు సరెండర్ చేసిన ఆయుధాలలో రైఫి ళ్లు ఇతర తుపాకులు ఉన్నాయి. లొంగిపోయిన వారిలో దేవ్ జీ,బడే



చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఇక, లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నగదు బహుమతి ఇస్తోంది. తెలంగాణ ప్రభుత్వం జనజీవన స్రవంతిలో కలిసిపోయిన డివిజనల్ కమిటీ సభ్యులకు ఐదు లక్షల రూపాయలు, ఏరియా కమిటీ సభ్యులకు నాలుగు లక్షల రూపాయలు, పార్టీ సభ్యులకు లక్ష రూపాయలు నగదు బహుమతి ప్రకటించింది.


# రైతుబంధు ఇంకా ఎప్పుడిస్తారు..?
### మూడు పంటలకని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వరా - కరీంనగర్ జిల్లాలో పర్యటించిన హరీష్ రావు



**కరీంనగర్,మార్చి7,తెలంగాణ దిశ :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివిలేదా అని ప్రశ్నించారు. మూడు పంటలకు రై తుబంధు ఇవ్వాలని గతంలో ఆయనచెప్పారని.. కానీ ఇప్పుడు తన హయాంలో మూడు పంటల కు రైతుబంధు ఎగొట్టారని ధ్వజమెత్తారు. శనివారం కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం గోపాలరా వుపల్లిలో హరీశ్‌రావు పర్యటించారు.

గోపాలరా వుపల్లిలో పంట పొలాల ను పరిశీలించారు. సాగునీరు లేక అన్నదాతలు పడుతున్న కష్టాలను అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా రైతులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఏ మొహం పెట్టుకుని రైతుల దగ్గరకు పోతారు..? అని హరీశ్‌రావు నిలదీశారు. పోలీసులు లేకుండా జనం దగ్గరకు ఎమ్మెల్యేలు, మంత్రులు వెళ్లగలరా..?అని ప్రశ్నల వర్షం కురిపి ంచారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని కాంగ్రెస్ నేతలు చిల్లర మాటలు మాట్లాడుతారా..? అని ధ్వజమెత్తారు.

# విద్యుత్ ఛార్జీలు పెంచే యోచన లేదు
### ఈఆర్సీ స్పష్టీకరణ - రూ9,583 కోట్ల రెవెన్యూ లోటు.. ప్రభుత్వ మద్దతు ఆశలు - రాష్ట్రంలో రికార్డు స్థాయికి చేరిన విద్యుత్ డిమాండ్ - గృహజ్యోతి పథకం -- వినియోగదారులకు పెద్ద ఊరట..



**హైదరాబాద్, మార్చి 7,తెలంగాణ దిశ :** తెలంగాణ విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నట్లు వస్తున్న వార్తలపై ఈఆర్సీ స్పందించింది. ఈ ఏడాది విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిపాదించలేదని ఈఆర్సీ తెలిపింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎలాంటి టారిఫ్ పెంపు కానీ, 'టైమ్ ఆఫ్ ద డే' ఛార్జీల పెంపు కానీ ఉండబోదని ఈఆర్సీ అధికారికంగా ప్రకటించింది. వచ్చే ఏడాదికి సుమారు రూ.50,242 కోట్ల ఆదాయ అవశ్యకత ఉంటుందని అంచనా వేసిన సంస్థ, ప్రస్తుత ఛార్జీల ద్వారా వచ్చే ఆదాయం ?40,659 కోట్లు మాత్రమేనని వివరించింది. ఈ క్రమంలో ఏర్పడే సుమారు రూ.9,583 కోట్ల రెవెన్యూ లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం నుంచి ఆర్థిక మద్దతును ఆశిస్తున్నట్లు సంస్థ పేర్కొంది. విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చెల్లించాల్సిన వ్యయం పెరిగినప్పటికీ, వినియోగదారులపై భారం పడకుండా ప్రభుత్వం ఈ గ్యాప్‌ను భరించనుందని స్పష్టమవుతోంది. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం , వినియోగదారుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ముఖ్యంగా ఎస్పీడీసీఎల్ పరిధిలో గత ఏడాదితో పోలిస్తే కొత్తగా సుమారు 12 లక్షల మంది వినియోగదారులు చేరడం గమనార్హం. ప్రస్తుతం మొత్తం కనెక్టెడ్ లోడ్ 35,175లకు చేరుకోగా, గరిష్ట విద్యుత్ డిమాండ్ 20,975 మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## విద్యుత్ ఛార్జీలు తగ్గించిన పంజాబ్ ప్రభుత్వం..

**న్యూఢిల్లీ,మార్చి,07:**అనేక రాష్ట్రాలు విద్యుత్ ఛార్జీలు పెంచుతూ ప్రజలపై భారం మోపుతుంటే.. పంజాబ్ ప్రభుత్వం మాత్రం ఛార్జీలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం పంజాబ్‌లో ముఖ్యమంత్రి భగవంత్ మన్ ఆధ్వర్యంలోని ఆమ్ ఆద్మీ (ఆప్) ప్రభుత్వం కొలువై ఉన్న సంగతి తెలిసిందే. ఆప్ ప్రభుత్వం కొద్ది రోజులుగా ఉచిత, సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా ప్రతి నెలా 300 యూనిట్ల వరకు గృహాలకు ఉచిత విద్యుత్ పథకాన్ని చాలా కాలం నుంచి అమలు చేస్తోంది. ఈ పథకంతో పేదలకు విద్యుత్ ఛార్జీల భారం తప్పిందని ఆప్ అంటోంది. ఇక.. ఇప్పుడు విద్యుత్ ఛార్జీల విషయంలో ఇంకో కీలక నిర్ణయం తీసుకుంది. పంజాబ్లో అన్ని రకాల విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని నిర్ణయించింది.

## ముగిసిన ఫిరాయింపు
# ఎమ్మెల్యేలపై విచారణ..
### సుప్రీంకోర్టు ఆదేశాలతో విచారణ ముగించిన స్పీకర్
### - 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్ - కడియం, దానంల భవితవ్యంపై ఉత్కంఠ

**హైదరాబాద్,మార్చి,07,తెలంగాణ దిశ :** తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవ హారం క్లైమాక్స్‌కు చేరుకుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పక్షాన చేరిన పది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈరోజు తుది విచారణ ముగించారు.సుప్రీంకోర్టు విధించిన గడువు ముగుస్తుండ టంతో స్పీకర్ తీసుకున్న నిర్ణయం కీలకంగా మారింది. ఇందులో ఎనిమిది మంది ఎమ్మె ల్యేలకు క్లీన్ చీట్ ఇచ్చిన స్పీకర్, వారిపై ఉన్న పిటిషన్లను కొట్టివేశారు. అయితే, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసుల్లో మాత్రం తీర్పును రిజర్వ్ చేశారు. వీరిద్దరి భవితవ్యంపై స్పీకర్ ఏ క్షణమైనా తుది తీర్పు వెలువరించే



అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

# మహిళల భద్రత మన అందరి బాధ్యత

## - స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 07, (తెలంగాణ దిశ) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని జరుపుకోవడం ద్వారా మన బాధ్యత తీరిపోదని, మన కుటుంబ సభ్యులకు జరిగే అసౌకర్యం గానీ అవమానం గానీ మనం ఏ విధంగా ఆలోచన చేస్తామో, సమాజంలో ప్రతి మహిళల పట్ల కూడా మనం అదే విధంగా ఆలోచన చేసి దానికి అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలి అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం కెపిహెచ్ బి లోని జెఎన్ టియుహ ఆడిటోరియంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డిజిపి చారు సిన్హా ఐపిఎస్, పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "స్టాండ్ విత్ హర్" కార్యక్రమానికి ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి, హైదరాబాదు పోలీస్ కమీషనర్ సజ్జనార్, హయ్యర్, స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరి యోగితారాణా, మహిళ శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, సైబరాబాద్ పోలీస్ కమీషనర్ ఎం రమేష్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, సైబరాబాదు మున్సిపల్ కమీషనర్ సృజన, యూనిసేఫ్ ఛీఫ్ ఫీల్డ్ ఆఫీసర్ జలాలీమ్ బిర్హాను టఫెస్సా, ప్రముఖ సిని నటుడు సాయి దుర్గ తేజ్, హాయజయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలనే ఒక మంచి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిలో మహిళల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించడం అలవాడాలన్నారు. మహిళల పట్ల మనమందరం .స్టాండ్ విత్ హర్



అని ఆలోచించి ఒక బాధ్యతగా తీసుకుంటే ఖచ్చితంగా నూటికి నూరు శాతం తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ అందించడం కష్టం కాదన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరి ఆలోచనలో మార్పురావాలన్నారు. . అందుకే మహిళల రక్షణ కోసం తెలంగాణ యువకులు ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా నిలబడి మనం ఎంత విజయం సాధించినా మహిళలను ఆర్థికంగా నిలబెట్టినప్పుడే ఆ కుటుంబం, ఆ రాష్ట్రం , ఆ దేశం ఆర్థికంగా బలపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం 2034కి 1 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ, 2047కి 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ రీచ్ అవ్వాలి అని అంటే సమాజంలో సగభాగమైన ఆడపిల్లలకు రక్షణ ఉండాలని, రక్షణ ఉన్న ఆడపిల్లలు ఆర్థికంగా ఎదగాలి, ఆర్థికంగా ఎదగాలి అంటే వాళ్ళు చదువుకోవాలి. వంటింటి కుందేళ్ళుగా ఇంటికే పరిమితం కాకుండా వాళ్లలో ఉన్న శక్తి నైపుణ్యాన్ని ఈరోజు వాళ్ళు అభివృద్ధి చేసుకొని తెలంగాణ ఎకానమీలో వాళ్ళని భాగస్వాములను చేయాలన్నదే మా ప్రభుత్వం యొక్క ఆలోచన అన్నారు. ఈరోజు ప్రపంచంలో ఏ అభివృద్ధి చెందిన దేశాన్నైనా చూడండి, ఏ దేశంలో అయితే మహిళలు ఇంట్రప్రెన్యూర్స్‌గా, మహిళా ఎంప్లాయిస్‌గా, మహిళలు సైంటిస్టులుగా లేకపోతే డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లుగా రాణించారో ఆ దేశమే ఆర్థిక పురోగతి సాధించినాయని, తెలంగాణ రాష్ట్రం కూడా ఆర్థిక పురోగతి వైపు వేగంగా ప్రయాణం చేస్తుందన్నారు. మహిళలు ఇంకా రాణించాలి, ధైర్యంగా వాళ్ళు ఉద్యోగ ఉపాధి అవకాశాలను నిర్వహించాలని అంటే ఆ మహిళలకు రక్షణ ఉండాలి, ఆ రక్షణ కలిగించే బాధ్యత చట్టాలు చేయడమో పోలీసుల పహారాలు కాయడమో సరిపోదు, మనమందరం కూడా సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.



మనమందరం కూడా ఆ రక్షణ కల్పించినప్పుడు ఎవరైనా ఏదైనా వాళ్ళకి ఇబ్బంది కలిగించినప్పుడు వారికి అండగా నిలబడి సహాయమందించాలన్నారు. నాకెందుకులే అని చూసి చూడనట్టు ఉండటం కూడా ఒక రకంగా నేరాన్ని ప్రోత్సహించడమే అవుతుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే అందిస్తున్నామని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరుతో, స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించి వారికి శిల్పారామం వద్ద దుకాణ సముదాయాన్ని కేటాయించామని, సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించి మహిళలు అదానీ, అంబానీలతో పోటీపడేలా చర్యలు చేపట్టామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశామని, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయించి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకుంటూ, మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి మహిళా శక్తి స్పూర్తిని చాటామన్నారు. మహిళా శక్తిపై రాష్ట్ర ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని,దేశంలోనే తెలంగాణను మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే స్టాండ్ విత్ హర్ కార్యక్రమం తీసుకున్నామన్నారు.

# ఉద్యమకారులకు న్యాయం చేయాలి : పూస శ్రీనివాస్



**భువనగిరి, మార్చి 07, (తెలంగాణ దిశ) :**తెలంగాణ రాష్ట్రం సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేయాలని, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని బిఆర్ అంబేద్కర్ సారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ కోరారు. శనివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని వినాయక చౌరస్తాలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తున్నామని చెప్పుకుంటున్నప్పటికీ, ఉద్యమకారుల పట్ల ఎందుకు వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదని పూస శ్రీనివాస్ విమర్శించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ఆఫ్ ది కాన్సి ట్యూషన్ ఆఫ్ ఇండియా ప్రకారం చిన్న రాష్ట్రాల ఏర్పాటు అనే అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్న ఉద్యమకారులకు అంబేద్కర్ గారే పెద్ద దిక్కని ఆయన తెలిపారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, నెలకు రూ.30 వేల పెన్షన్, హెల్త్ కార్డులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎల్ఎఫ్ నాయకులు కొడిమాల క్రిష్ణ, గొర్ల లక్ష్మణ్, మంతపురం వినోద్‌కుమార్, గోపరాజు గణేష్, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

# కొత్త కారు కొనుగోలు చేసిన వినియోగదారుడికి కష్టాల పరంపర

## - సాంకేతిక లోపంతో నిలిచిపోయిన వాహనం, పట్టించుకోని షోరూం యాజమాన్యం




**కుషాయిగూడ, మార్చి 07, (తెలంగాణ దిశ) :**కుషాయిగూడ ప్రాంతంలో ఉన్న ఒక ప్రముఖ కారు విక్రయ కేంద్రం వద్ద వినియోగదారుడికి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ బాధితుడు ఆందోళన వ్యక్తం చేశాడు. కొత్తగా కొనుగోలు చేసిన తన వాహనం సాంకేతిక లోపాలతో తరచూ సమస్యలు కలిగిస్తోందని, దాన్ని మరమ్మతుల కోసం విక్రయ కేంద్రానికి తీసుకెళ్లినప్పటికీ అక్కడి సిబ్బంది సరైన స్పందన ఇవ్వలేదని ఆయన వాపోయాడు.బాధితుడి వివరాల ప్రకారం, ఇటీవల కొనుగోలు చేసిన వాహనం కొద్ది రోజులకే పనిచేయడంలో సమస్యలు ఎదురవ్వడం ప్రారంభమయ్యాయి. ఈ సమస్యల కారణంగా వాహనాన్ని మరమ్మతుల కోసం కుషాయిగూడలోని విక్రయ కేంద్రానికి అప్పగించినట్లు తెలిపారు. అయితే వాహనం అప్పగించి పదిహేను రోజులు గడిచినా ఇంకా తిరిగి ఇవ్వలేదని, సమస్య ఏమిటో కూడా




స్పష్టంగా చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించాడు. ఇప్పటికే పదిహేను రోజులుగా వాహనం లేక ఇబ్బందులు పడుతున్నామని, రోజువారీ పనులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని బాధితుడు తెలిపాడు. పలుమార్లు విక్రయ కేంద్రం సిబ్బందిని సంప్రదించినప్పటికీ సరైన సమాధానం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు.ఈ విషయంపై బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, తాను కొనుగోలు చేసిన వాహనానికి సంబంధించిన సమస్యను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని సంబంధిత సంస్థ యాజమాన్యాన్ని కోరాడు. వినియోగదారుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని, తక్షణమే స్పందించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.స్థాని కులు కూడా వినియోగదారుడి సమస్యపై స్పందిస్తూ, ప్రజలు నమ్మకంతో కొనుగోలు చేసే వాహనాల విషయంలో సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సమస్య త్వరగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే బస్తీబాట

## - కాంగ్రెస్ నాయకుడు వివిఎస్ ప్రకాష్ రెడ్డి





**నాచారం, మార్చి 07, (తెలంగాణ దిశ) :**నాచారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో శనివారం కాంగ్రెస్ నాయకుడు వివిఎస్ ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాంరెడ్డి నగర్ రేణుకా ఎల్లమ్మ గుడి వద్ద అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కుమ్మర బస్తీ కాలనీ వాసులను గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. బస్తిబాట కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగాప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అర్హులైన వారికి దరఖాస్తు చేయిస్తున్నామని, ప్రజలకు అందని పథకాలను అర్హులైన వారికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.
అనంతరం నాచారం ఓల్డ్ విలేజ్ ఎరుకల బస్తీ కాలనీ వాసులతో కలిసి, ప్రభుత్వ పథకాలు అందని వారు దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అదే విధంగా పథకాలు అందని వారు దరఖాస్తులు కూడా అందజేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ రావు, సుధాకర్ రెడ్డి, ఫిరోజ్, అజీమ్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, యుసుఫ్, బాలుగౌడ్, నాయుడు, ప్రవీణ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉమ, మమత, విజయ, శైని, శ్యామల, రాథ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ





**ఏఎస్ రావునగర్, మార్చి 07, (తెలంగాణ దిశ) :**కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని మజీద్ వద్ద రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రియాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసంలో పేదలకు సహాయం చేయడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఉప్పల్ బాగాయత్ లో ఎంఎంసీ కార్యాలయానికి స్థలం కేటాయింపు

## - సీఎంతో మాట్లాడి బాగాయత్ లో ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉప్పల్, మార్చి 07, (తెలంగాణ దిశ) :**ఉప్పల్ బాగాయత్ లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కార్యాలయాన్ని నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించింది. శనివారం ఈ స్థలాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించారు. తన కృషి ఫలితంగానే ఉప్పల్ భగాయత్ లోని ఆ స్థలాన్ని అధికారులు యుద్ధప్రాతిపదికన చదును చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అయితే మల్కాజిగిరి కార్పొరేషన్ ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సరికొత్త భవనం కోసం ఉప్పల్ భగాయత్ అనువైన స్థలమని ప్రభుత్వంలోని పెద్దల ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. నగరానికి అతి చేరువలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విశాలమైన రోడ్లు, పార్కులతో మూసీకి పక్కనే రూపొందించిన ఉప్పల్ భగాయత్ లో స్థలం అందుబాటులో ఉండడంతో పాటు శనివారం ఆగమేఘాల



మీద ఆ స్థలాన్ని ఉప్పల్ భగాయత్ లో చదును చేస్తున్న ప్రభుత్వ స్థలం ఎంఎంసీ అధికారులు చదును చేయిస్తుండడంతో ఇక్కడే ఏర్పాటు అవుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.నగరానికి చేరువలో, భౌగోళికంగా మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో ఉప్పల్ కేంద్ర బిందువుగా ఉండడం, విశాలమైన, అనువైన స్థలం ఉండడం ఇక్కడే కార్పొరేషన్ కార్యాలయం నిర్మిస్తామని లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మోడు వారిన మొక్కలు... పట్టించుకోని అధికారులు

**నాగారం, మార్చి 07, (తెలంగాణ దిశ) :**ఘట్కేసర్ సర్కిల్--06 పరిధిలోని నాగారం వార్డు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న బ్రిడ్జిపై నాటిన మొక్కలు సంరక్షణ లేక మోడు వారుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ఘనంగా నాటిన ఈ మొక్కలకు సరైన విధంగా నీళ్లు పోయకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. వార్డు కార్యాలయానికి దగ్గరలోనే ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, సిబ్బంది వాటి సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని కాపాడటం కూడా అధికారుల బాధ్యత అని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించేలా చర్యలు



తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కాలనీల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా : బండారి లక్ష్మారెడ్డి





**కాప్రా, మార్చి 07, (తెలంగాణ దిశ) :**ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం కాప్రా డివిజన్ పరిధిలో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే దిశగా సుమారు రూ.1.07 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీ సాయి ఎన్‌క్లేవ్‌లో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, శివా నగర్‌లో రూ.32 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సాయి రామ్ నగర్ డబల్ బెడ్ రూమ్ హౌసింగ్ సొసైటీ పరిధిలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి పనులు పూర్తి అయిన అనంతరం స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్, పార్టీ నాయకులు ఇంద్రయ్య, మహేష్, భాస్కర్, గిల్బర్ట్., శ్రీకాంత్ గౌడ్, పాబాల సీను, ఘౌస్, బండి మోహన్, కిట్టు, శివ, అధికారులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## స్వదేశీ ప్రచారం

శక్తివంతమైన, అభివృద్ధి చెందిన భారత్‌కు.. స్వయంసమృద్ధి చెందిన భారతదేశమే పునాది. రక్షణ, సాంకేతికత, ఇంధన, అంతరిక్షంతో పాటు తయారీ రంగాల్లో పురోగతి 2047 నాటికి మనల్ని అభివృద్ధి చెందిన భారత్‌గా నిలుపుతుంది'ఇటీవల 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలను నొక్కిచెబుతూ చేసిన వ్యాఖ్యలివి. యువత స్వదేశంలోనే జెట్ ఇంజిన్లు, సెమీకండక్టర్ చిప్స్, ఇతర సాంకేతిక ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని కోరుతున్నా. తద్వారా మనం స్వయంసమృద్ధి సాధించగలం" అని అన్నారు. స్వయంసమృద్ధి అంటే, కేవలం దేశానికే పరిమితం కాదని.. ఇతర దేశాలతో పరస్పర సహకారం కొనసాగిస్తూ శక్తిసామర్థ్యాలను, స్వయంప్రతిపత్తిని పెంపొందించుకోవడమని కూడా అన్నారు. కార్లు, ఫోన్ల తయారీ నుంచి వస్త్రాలు, ఆహార భద్రత వరకూ భారత్ గత కొన్నేళ్లుగా అద్భుతమైన పురోగతి సాధించింది. అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గందరగోళ పరిస్థితులు, భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాల విధింపు వంటి వాటి కారణంగా, 'స్వదేశీ' ప్రచారం ఊపందుకుంటోంది. వ్యవసాయం, మైనింగ్, ఇనుము, ఉక్కు, వాహనాల విడిభాగాలు, పారిశ్రామిక యంత్రాలు, ఫర్నిచర్, తోలు, పాదరక్షల తయారీ, దేశీయ రక్షణ రంగ ఉత్పత్తులు, ఐటీ, ఇతర డిజిటల్ సేవల రంగాల్లో భారత్ స్వావలంబన సాధించింది. కానీ, ఇంకా విదేశీ ముడి పదార్థాలు, టెక్నాలజీ, రీసర్చ్‌పై ఆధారపడిన అనేక రంగాలున్నాయి. మొబైల్ ఫోన్లు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి అవసరమైన సెమీకండక్టర్ చిప్స్ వంటి హైటెక్ ముడి వస్తువులను భారత్ దిగుమతి చేసుకుంటోంది. అంతేకాకుండా.. చైనా సాంకేతిక నైపుణ్యం, సరసమైన ధరల కారణంగా భారత్ ఈ వస్తువుల కోసం చైనాపై ఎక్కువగా ఆధారపడుతోంది. ఈ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ ఇప్పటికే విధానపరమైన నిర్ణయాల విషయంలో చొరవ తీసుకుంది. మేక్ ఇన్ ఇండియా, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ప్రొడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ వంటి స్కీముల ద్వారా భారత్‌లో సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముడి పదార్థాలు/వస్తువుల లభ్యత గురించి ఎలిస్టా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సీఎండీ సాకేత్ గౌరవ్ మాట్లాడుతూ, "మేం స్మార్ట్ టీవీలను తయారుచేస్తాం. వాటిలో వినియోగించే ముఖ్యమైన విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. మా ఉత్పత్తులలో వినియోగించే అనేక భాగాలను ఇప్పటికీ దిగుమతి చేసుకుంటున్నాం. అవి భారత్‌లో తయారవడం లేదు" అని చెప్పారు. ఎలిస్టా కంపెనీ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో రూ. 250 కోట్లతో మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించింది."అలాగే భారతీయ బ్రాండ్లు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి ఏంటంటే.. ఇక్కడ తయారైన వస్తువులు నాణ్యత పరంగా బాగున్నప్పటికీ, మన వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడతారు" అని సాకేత్ గౌరవ్ అన్నారు. అయితే, రానున్న ఐదేళ్లలో సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధిస్తుందని కూడా ఆయన అన్నారు."ఐదు నుంచి ఆరేళ్లలో ముఖ్యమైన విడిభాగాలను ఇక్కడే తయారు చేయగలమని ఆశిస్తున్నా. ప్రస్తుతం, అందుకు అవసరమైన టెక్నాలజీ, ప్రాసెస్ చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు" అని సాకేత్ గౌరవ్ చెప్పారు."భారత్‌లో తయారైన ఉత్పత్తులు విదేశీ బ్రాండ్ల కంటే తక్కువ ధరకే లభిస్తాయి. కానీ, వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడుతున్నారు."ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల నుంచి టర్బైన్ల వరకు, పర్మినెంట్ మాగ్నెట్స్, లైటింగ్, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ యుద్ధ పరికరాలు, అనేక ఇతర రోజువారీ నిత్యవసరాలతో సహా అనేక ఉత్పత్తుల తయారీకి అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్ కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్ తనకు అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో దాదాపు 99 శాతం దిగుమతి చేసుకుంటోంది. అందుకు చైనాపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. భారత్‌లో రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను రీసైక్లింగ్ చేసే అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన అటెరో సీఈవో, కంపెనీ సహ వ్యవస్థాపకులు నితిన్ గుప్తా మాట్లాడుతూ, "భారత్ ప్రస్తుతం 99 శాతం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. కానీ, ఈ పరిశ్రమ పురోగతికి అనువైన వ్యవస్థను అభివృద్ధి చేసినట్లయితే.. భారత్ 70 శాతం అవసరాలను రీసైక్లింగ్ ద్వారా తీర్చుకోవచ్చు" అని అన్నారు. అటెరో కంపెనీ ఇటీవల తన సామర్థ్యాన్ని 300 టన్నుల నుంచి 30 వేల టన్నులకు పెంచుకుంది."చాలా ముఖ్యమైన ఉత్పత్తుల తయారీలో రేర్ ఎర్త్ మెటీరియల్స్ చాలా కీలకం. భారత్ ఈ విషయంలో స్వయంసమృద్ధి సాధించే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. భారత్‌లోనూ రేర్ ఎర్త్ మెటీరియల్స్ నిల్వలు ఉన్నాయి, కానీ ప్రస్తుతం వాటి మైనింగ్ జరగడం లేదు. ప్రపంచంలోని మొత్తం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో 99 శాతం చైనా నుంచే వస్తున్నాయి, ఈ విషయంలో భారత్ ఇప్పటివరకూ పెద్దగా చేసిందేమీ లేదు" అని నితిన్ గుప్తా అన్నారు."రీసైక్లింగ్ హబ్‌గా మారడం ద్వారా భారత్ తన అవసరాలను తీర్చుకునే దిశగా ముందుకెళ్లొచ్చు. మనం మార్కెట్‌లో పోటాపోటీ ధరకు రీసైకిల్ చేయగలం, కానీ అది భారీ స్థాయిలో జరగాల్సిన అవసరముంది."అయితే, కేవలం రీసైక్లింగ్ ద్వారానే భారత్ అవసరాలు తీరతాయా? అనేదే ఇక్కడి ప్రశ్న. విషయంలో నితిన్ గుప్తా ఆశావహంగానే ఉన్నారు.. 2025 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో, భారత్ 9.74 లక్షల టన్నుల డీఏపీ (డైఅమ్మోనియం ఫాస్ఫేట్)ను దిగుమతి చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో డీఏపీ మొత్తం దిగుమతులు దాదాపు 45.7 లక్షల టన్నులు. యూరియా దాదాపు 56 లక్షల టన్నులు. ఎరువుల తయారీలో ఇది చాలా కీలకం. దేశీయంగా అవసరమైన ఖనిజాల కొరతతో పాటు అభివృద్ధి చెందిన మైనింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థ లేకపోవడం. లిథియం, కోబాల్ట్, మెగ్నీషియం, నికెల్ వంటి ముఖ్యమైన ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అయితే, ఈ కీలకమైన ఖనిజ నిల్వలు భారత్‌లో పరిమితంగానే ఉన్నాయి. లేదంటే నిల్వలు ఉన్నప్పటికీ.. మైనింగ్ సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ఆర్థిక వ్యవహారాల విశ్లేషకులు, జర్నలిస్ట్ నరేంద్ర తనేజా మాట్లాడుతూ, "భారతీయ పరిశ్రమలు ముడి చమురు, పెట్రోకెమికల్స్ దిగుమతులపై ఆధారపడి ఉన్నాయి. పెట్రోకెమికల్స్‌పై ఆధారపడని రంగం దాదాపుగా అరుదు. కానీ, ఈ అవసరాలన్నింటికీ భారత్ దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్‌లో ముడిచమురు నిల్వలు లేవని కాదు, కానీ అవి ఉన్నచోట్ల వాటిని వెలికితీయడంలోనూ సవాళ్లున్నాయి" అని అన్నారు. భారత్ దేశీయ రక్షణ రంగ ఉత్పత్తిని ప్రోత్సహించినప్పటికీ, రక్షణ పరమైన అవసరాల కోసం ఇప్పటికీ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడి ఉంది. యుద్ధ విమానాల నుంచి జలాంతర్గాముల వరకు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను కూడా భారత్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. 2023 గణాంకాల ప్రకారం, భారత్ తన రక్షణ బడ్జెట్‌లో 36 శాతం దిగుమతులపైనే ఖర్చు చేసింది. జెట్ ఇంజిన్లు, రాడార్ల వంటి హైటెక్ పరికరాలను భారత్ ఇప్పటికీ దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది. ఇంకా, అధునాతన ఆయుధాల కోసం కూడా విదేశాలపై ఆధారపడుతోంది భారత్ దేశీయంగానూ రక్షణ రంగ ఉత్పత్తిని పెంచింది.


# విభజనతో పాటే కాశ్మీర్ చిచ్చు

### నాటి పాలకుల దృష్టి లోపం
### సమర్థ నాయకత్వ లోపంతో సమస్యలు



న్యూఢిల్లీ: బ్రిటిష్ పాలకులు దేశాన్ని విభజించడమే కాకుండా.. అనేక మెలికలు పెట్టి వెళ్లారు. అలాంటి దాంట్లో కాశ్మీర్ సమస్య ఒకటి. నేటికీ అది రావణకాష్టంగా మారడానికి కారణం వారి కుత్సిత రాజకీయ తంత్రమే. వెళుతూవెళుతూ సంస్థానాలను వారి స్వేచ్ఛకు వదిలేసి వెళ్లారు. ఇదే క్రమంలో భారత్ ఆశ్రయం పొంది భారత్‌లో విలీనం కావడానికి కాశ్మీర్ రాజు హరిసింగ్ చేసిన ప్రయత్నాల ను విభజిత పాక్ అడ్డుకుంది. కొంత భాగాన్ని ఆక్రమించడంతో దిక్కులేని స్థితిలో కాశ్మీర్ రాజు భారత్ ఆశ్రయం పొందాడు. అయితే ఆనాటి ప్రధాని నెహ్రూ తాత్సారం, ఉదాసీనత కారణంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య అలాగే ఉండిపోయింది. అలాగే 370 ఆర్టికల్‌తో కొత్తచిచ్చును కూడా నెహ్రూ రాజేశారు. తొలుత కశ్మీర్ రాజు హరిసిం‌గ్ స్వతంత్రంగా ఉంటానని చేసి, పాకిస్థాన్‌తో మమేకం అయ్యేందుకు ప్రయత్నించారు. కానీ వెంటనే తమతో మమేకం కాకపోవడంతో పాకిస్థాన్‌లోని ప్రభుత్వం ఆక్రమిత కశ్మీర్ భాగంలోని గిరిజనులను ఉసిగొలిపితే కశ్మీర్ రాజు హరిసింగ్.. నాటి నెహ్రూ ప్రభుత్వాన్ని శరణు కోరారు. తర్వాత కశ్మీర్ కూడా భారతదేశంలో భూభాగమైనా.. ఆక్రమిత కాశ్మీర్ సమస్యనేటికీ తెగడంలేదు. కాశ్మీర్ రాజు ఒప్పందం మేరకు కాశ్మీర్ యావత్తూ భారత్ భూభాగంగా ఉండాలి. కానీ పాక్ పాలకు తీరు, నాటి భారత్ పాలకుల ముందు చూపు లేకపోవడం కారణంగా నేటికి దానిని రావణ కాష్టంగా మార్చేశాయి. మిలిటెంట్ల చొరబాట్లు, పాక్ సైన్యం అకారణంగా కాల్పులు జరుపడం నిత్యకృత్యంగా మారింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. మత ఘర్షణల నివారణకే దేశ విభజన వందేండ్ల పోరాటం తర్వాత భారత్ 1947లో వలస పాలకుల నుంచి విముక్తి పొందింది. బ్రిటన్ పార్లమెంట్ స్థానంలో భారత స్వాతంత్ర్య చట్టం అమలులోకి వచ్చింది. ఆగస్టు 15వ తేదీ నుంచి బ్రిటీషువారి పాలన ముగుస్తుందని ఆ చట్టం నిర్దేశించింది. అలాగే దేశాన్ని రెండు సార్వభౌమ దేశాలైన ఐక్య భారత్, అధినివేశ పాకిస్థాన్‌గా విభజించాలని సూచించింది. రెండు దేశాలకు కేటాయించాల్సిన ప్రాంతాల పర్యవేక్షణకు బ్రిటీషు వారు సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌ను రంగంలోకి దించారు. వృత్తిరీత్యా న్యాయాధికారి రాడ్‌క్లిఫ్‌ను సరిహద్దు కమిషన్‌కు చైర్మన్‌గా నియమించారు. ఒక దేశాన్ని రెండు స్వతంత్ర దేశాలుగా విడగొట్టే గీత గీయడానికి ఈ కమిషన్‌ను నియమించారు. ఢిల్లీ దేశ విభజన అనంతరం దాదాపు 1.5 కోట్ల మంది తమ నివాస ప్రదేశాలను వదిలి రాడ్‌క్లిఫ్ గీతకు అటూ ఇటూ ప్రయాణిం చారు. వారిలో కొందరు కాలినడకన, మరికొందరు రైళ్లలో, బస్సుల్లో రవాణా వసతి ఏది దొరికితే దానిలో గీత దాటారు. ఈ సందర్భంగా జరిగిన మతోన్మాద మారణకాండలో దాదాపు పదిలక్షల మంది తమ ప్రాణాలు కోల్పోయారు. లక్షల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డాయి. వేల మంది మహిళలపై లైంగిక దాడులు జరిగాయి. దేశవిభజనతో ఒక ప్రాంతం నుంచి మరోప్రాంతానికి తరలివెళుతున్న నిరాశ్రయులైన జనంతో ఢిల్లీ గుడారాల నగరంగా మారిపోయింది. ఇండ్లను, పుట్టి పెరిగిన ప్రాంతాలను వదిలి, మతకల్లోలాల్లో సర్వం పోగొట్టుకొని శరణార్థులుగా మారారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులదీ ఇదే పరిస్థితి. అదే సమయంలో ఢిల్లీ జనాభాలో.. వలస వచ్చిన ప్రజల సంఖ్య దాదాపు మూడోవంతు వరకు చేరుకున్న దంటే.. ఏ స్థాయిలో వలసలు జరిగాయో ఊహించుకోవచ్చు. నిట్టనిలువునా చీలిన పంజాబ్ లోనూ ఇదే పరిస్థితి. పలు కాలేజీలు వలస ప్రజల శిబిరాలుగా మారిపోయాయి. కనీస సౌకర్యాలు లేక, ఆహారం లేక జనం అలమటించిపోయారు. ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ ఆహారం రోజుకు ఒక చపాతీకి తగ్గించారు. ఆకలితో అల్లాడి వేల మంది మరణించారు. ఇంతటి దారుణం తరవాత కూడా పాక్ భారత్‌తో యుద్ధం చేసి ఓడిపోయింది ఆనాడే ఆక్రమిత కాశ్మీర్ సంగతి తేల్చి వుంటే ఇవాళ ఈ గతి ఉండేది కాదని చరిత్రకారులు అంటారు.

# వైసీపీ ఉక్కు రాజకీయం




**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** ఏ రాష్ట్రంలోనైనా సరే ప్రతిపక్షాలు బలపడేది ప్రజా ఉద్యమాల ద్వారానే. ఇది చాలాసార్లు రుజువైన విషయం. ఏపీలో 2024 తర్వాత విపక్షాలకు కలిసివచ్చిన అలాంటి అంశాలు చాలా తక్కువ. చేసిన కొద్దిపాటి ఉద్యమాలు నిరసనలు రాష్ట్రం మొత్తాన్ని కదిలించే అంశాలు కావు. కొన్ని ముఖ్యమైన అంశాలు అలాంటివి దొరికినా వాటిని విపక్షాలు సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. అలాంటి వాటిలో రాయలసీమ మామిడి రైతుల ఆందోళన, నెల్లూరు జిల్లా కర్రేడులో భూములు కోల్పోతున్న గ్రామస్తుల నిరసన, పెరిగిపోయిన విద్యుత్ బిల్లుల అంశాల వంటివి ముఖ్యం. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై ఇంతవరకు విపక్షాలు కలిసికట్టుగా ముందుకు దిగిన ఉద్యమాలు లేనే లేవు. పోనీ ప్రధాన విపక్షాలుగా భావించే పార్టీలు ఒంటరిగానన్నా ఇలాంటి ముఖ్యమైన విషయాల్లో ఉద్యమానికి దిగాయా అంటే అదీ లేదు. అలాంటి తరుణంలో ప్రధాన విపక్షం వైసీపీకి ఒక ముఖ్యమైన ఆయుధంలా మారే ఛాన్స్ " విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ " అంశం ద్వారా వస్తోంది.'ఆంధ్రుల హక్కు -విశాఖ ఉక్కు' నినాదంతో ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పుడు ప్రైవేటుపరం కాబోతున్న సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. ఒకపక్క స్టీల్ ప్లాంట్‌ని ఆదుకుంటామని చెబుతున్న కేంద్రం మరోవైపు "పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి" గతంలో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని చెబుతోంది. దీంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు కార్మికులలతోపాటు సగటు తెలుగువాడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం అయిపోతుందన్న నమ్మకానికి దగ్గరవుతున్నారు. ప్రతి నెల వీఆర్ఎస్ తీసుకునే ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ ఉండడంతో పాటు తాజాగా 32విభాగాలను ప్రైవేట్‌పరం చేశారంటూ వస్తున్న వార్తలు ఏళ్ల తరబడి ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగుల నమ్మకంపై దెబ్బకొడుతున్నాయి. అయితే ప్రైవేటు పరం కాకుండా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామంటూ కూటమి నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించలేక పోతున్నాయి అనేది వాస్తవం అని వామపక్ష నేతలు చెప్తున్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు చేస్తున్న పోరాటానికి బలం సరిపోవడం లేదు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ఉద్యమించడానికి విపక్ష వైసిపికి ఇది అద్భుతమైన అవకాశమని ఎనలిస్టులు చెప్తున్నారు. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లు వారు చెప్పినట్టుగానే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం నెమ్మదించింది. ప్రవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోకపోయినప్పటికీ దానిపై ముందుకు కూడా వెళ్లలేదు. కాబట్టి ఐదేళ్లు స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నాం అనే క్లయిమ్ వైసిపి నేతలు చేసుకుంటున్నారు. ఇప్పుడు దాన్ని ఆధారంగా చేసుకుని స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగులతో కలిసి ఉద్యమించే అవకాశం వైసీపీకి ఉంది. నిజంగా అలా చేస్తే ప్రజల్లో పార్టీ ఇమేజ్ కూడా పెరుగుతోంది. కానీ రాష్ట్రంలో తన ప్రత్యర్థులతో కలిసి ఉన్న బిజెపికి ఉప రాష్టపతి ఎన్నికల్లో కేంద్రంలో మద్దతిచ్చిన వింత పరిస్థితి వైసిపిది. చంద్రబాబు, పవన్ పై ఒంటికాలిపై లేచే జగన్మోహన్ రెడ్డి బీజేపీపై అంతే తీవ్రంగా ఈ అంశంపై పోరాడగల ధైర్యం చేస్తారా అనేది రాజకీయవర్గాల్లో చర్చగా మారింది. పోలవరం, అమరావతి, వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఈ మూడు ప్రస్తుతం ఆంధ్రుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్నవి. అమరావతిపై వైసీపీ ఇప్పటికీ అస్పష్టమైన స్టాండ్ తోటే ఉంది . పోలవరం నిర్మాణాన్ని రివర్స్ టెండరింగ్ పేరుతో ఐదేళ్లు వెనక తీసుకుపోయిందంటూ టిడిపి పదే పదే ఆరోపణలు చేస్తున్నా దానికి సరైన కౌంటర్ వైసీపీ నుంచి రావడం లేదు. ఇక వారికి మిగిలింది వైజాగ్ స్టీల్ ప్లాంట్. కూటమి నేతల అస్పష్ట ప్రకటనల మధ్య స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం విపక్షాలు ఉద్యమిస్తే కచ్చితంగా ప్రజలు మద్దతు వారికి ఉంటుంది.

# భాగ్యనగరానికి బీచ్..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** పర్యాటకులను ఆకర్షించే అద్భుతమైన చారిత్రక కట్టడాలు, సంస్కృతికి హైదరాబాద్ ప్రసిద్ధి చెందింది. అయితే, సముద్ర తీరం లేకపోవడంతో బీచ్ అనుభూతిని పొందాలంటే నగరవాసులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇకపై ఆ అవసరం లేదు. ముత్యాల నగరానికి త్వరలో కృత్రిమ బీచ్ అందాలు తోడవ్వబోతున్నాయి. ఈ కృత్రిమ బీచ్‌ను నిజమైన బీచ్‌కు ఏమాత్రం తగ్గకుండా రూపొందించనున్నారు. ఇక్కడ సందర్శకుల కోసం అనేక ఆకర్షణీయమైన ఏర్పాట్లు చేయబోతున్నా రు. జల విలాసాలు... ఈ ప్రాజెక్టులో ముఖ్యంగా ఆకట్టుకునే అంశం నీటిపై తేలియాడే విల్లాలు. వీటితో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు కూడా ఏర్పాటు చేస్తారు. సాహస క్రీడలు... థ్రిల్ కోరుకునే వారి కోసం బంగీ జంపింగ్, స్కేటింగ్, సెయిలింగ్ వంటి సాహస క్రీడలు అందుబాటులో ఉంటాయి. వీటికి తోడు ప్రత్యేకంగా వింటర్ స్పోర్ట్స్‌ను కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. కుటుంబ వినోదం... కుటుంబంతో కలిసి ఆనందించేం దుకు వీలుగా పార్కులు, పిల్లల ఆట స్థలా లు, సైక్లింగ్ జోన్లు, జా గింగ్ ట్రాక్లు ఉంటా యి. అదనపు ఆకర్షణలు.. ఫుడ్ కోర్టులు, థియేటర్లు, అలంకార ఫౌంటెన్లు, వేవ్ పూల్స్ వంటి విశ్రాంతి స్థలాలు సందర్శకులను కట్టిపడేస్తాయి. అన్ని రకాల సదుపాయాలతో ఇది కేవలం ఒక బీచ్గా కాకుండా, ఒక సంపూర్ణ వినోద కేంద్రంగా మారబోతోంది. ఔటర్ రింగ్ రోడ్కు సమీపంలో ఉండటంతో నగరంలో ఎక్కడి నుంచైనా సులభంగా చేరుకునే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయి తే హైదరాబాద్ పర్యాటక రంగంలో కొత్త అధ్యాయం మొదలవుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. హైదరాబాద్‌లో మొట్టమొదటి ఆర్టిఫిషియల్ బీచ్ ఈ ఏడాది డిసెంబర్‌లో కొత్వాల్ గూడ వద్ద ప్రారంభం కానుంది. రూ.225 కోట్ల బడ్జెట్‌తో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్, సముద్ర తీర అనుభవాన్ని అందించే మానవ నిర్మిత సరస్సు. ఇక్కడ అడ్వెంచర్ స్పోర్ట్స్, ఫ్లోటింగ్ విల్లాస్, వేవ్ పూల్స్ వంటి సౌకర్యాలతో నగరవాసులకు వారాంతపు వినోదాన్ని అందించనుంది. సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ ఆర్టిఫిషియల్ బీచ్, సముద్ర తీరాన్ని పోలిన అనుభవాన్ని అందించేలా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ డీపీఆర్ ఇప్పటికే సిద్ధమైంది. అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌టీడీసీ) చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి ఈ ప్రాజెక్టును రాష్ట్ర టూరిజం రంగంలో కీలకమైన అడుగుగా చెబుతున్నారు. ఈ ఆర్టిఫిషియల్ బీచ్ కేవలం ఇసుక, నీటితో మాత్రమే పరిమితం కాదు. ఇందులో ఫ్లోటింగ్ విల్లాస్, స్టార్-కేటగిరీ హోటళ్లు, వేవ్ పూల్స్, ఫుడ్ కోర్టులు, థియేట్రికల్ వేదికలు, డెకొరేటివ్ ఫౌంటైన్స్, పార్కులు, సైక్లింగ్ ట్రాక్‌లు, స్కేటింగ్, బంజీ జంపింగ్, సెయిలింగ్, సిమ్యులేటెడ్ వింటర్ స్పోర్ట్స్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఈ సౌకర్యాలు కుటుంబాలకు ఒక రోజంతా ఆనందించే అనుభవాన్ని అందించేలా సిద్ధం చేస్తారు. తెలంగాణలో టూరిజం రూ. 15,000 కోట్ల స్థాయిలో ఉంది. ఈ ఆర్టిఫిషియల్ బీచ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌ను గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఒక ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ నగరవాసులకు నగరం వెలుపల ప్రయాణం చేయకుండానే వారాంత వినోదాన్ని అందించడంతో పాటు, హైదరాబాద్‌ను ఒక డైనమిక్ అర్బన్ రిట్రీట్‌గా రూపొందించనుంది.

# గిరిజనులకు అంబేద్కర్ వర్శిటీ ఉచిత విద్య...

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**కొంత మంది ఉన్నత చదువులు చదివి.. పెద్ద ఉద్యోగం చేయాలనే ఆశతో ఉంటారు. కానీ దానికి తగ్గట్లు ఆర్థిక స్థోమత, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మధ్యలో తమ చదువులు ఆపేసి ఏదో ఒక ఉద్యోగం చేస్తుంటారు. ఇక మహిళలకు అయితే పెళ్లి చేసి.. తమ బాధ్యతలను తీర్చుకుంటారు చాలా మంది తల్లిదండ్రులు. కానీ.. వారికి ఇంకా చదవాలనే కోరిక మాత్రం అలానే ఉండిపోతుంది. అలాంటి వారి కోసం ఓపెన్ విద్య అనేది ఒక వరంలాంటిది. ముఖ్యంగా తెలంగాణలో డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇలాంటి వారి ఎందరో కలలను నెరవేర్చింది. మధ్యలో చదువు ఆపేసిన వారికి.. ఉద్యోగం చేస్తూ చదువుకోవాలనుకునే వారికి వారి కోరికలను తీర్చింది. కొంతమంది ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆశపడతారు. అయితే ఆర్థిక, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల చాలా మంది తమ చదువులను మధ్యలోనే ఆపేస్తుంటారు. అలాంటి వారిలో మహిళలు, మారుమూల ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ఉంటారు. ఇలా చదువుకు దూరమైన వారికి, ఉద్యోగం చేస్తూనే చదువుకోవాలనుకునే వారికి డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ యూనివర్సిటీ ప్రతి సంవత్సరం డిగ్రీ, పీజీ, డిప్లొమా వంటి అనేక కోర్సులకు అడ్మిషన్లు ప్రకటిస్తుంది. ఇప్పుడు.. ఒక కొత్త నిర్ణయంతో ఈ యూనివర్సిటీ మరింత మందికి చేరువ కానుంది. డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఆదివాసీ విద్యార్థులకు ఉచిత విద్య అందించనున్నట్లు ప్రకటించింది. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఈ విషయాన్ని వెల్లడించారు. యూనివర్సిటీ గడిచిన నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మందికి ఉన్నత విద్య అందించినా, ఇంకా కొన్ని వర్గాల ప్రజలు చదువుకు దూరంగా ఉన్నారని, అందులో ముఖ్యంగా ఆదివాసీ తెగలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సమస్యను గుర్తించిన యూనివర్సిటీ, వారికి ఉన్నత విద్యను అందించాలని నిర్ణయించుకుంది. యూనివర్సిటీ నినాదంకు అనుగుణంగా, మారుమూల ప్రాంతాల్లో కూడా స్టడీ సెంటర్లు ఏర్పాటు




చేసినప్పటికీ.. ఆదివాసీలకు ఇంకా పూర్తిస్థాయిలో చేరువ కాలేకపోయామని యూనివర్సిటీ అధికారులు గుర్తించారు. అందుకే వారికి ఆర్థిక భారం లేకుండా, చదువుకు కావలసిన వనరులు అందించడానికి ఈ ప్రణాళికను రూపొందించారు. ఈ పథకం ప్రకారం..

ఆదివాసీ విద్యార్థులు ఎటువంటి బోధనా రుసుముచెల్లిం చాల్సిన అవసరం లేదు. కేవలం రూ.500 నామమాత్రపు అడ్మిషన్ ఫీజుతో వారు డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చు. అంతేకాకుండా వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తారు. వసూలు చేసే ఆ డబ్బులు కూడా పుస్తకాల కోసమే అని తెలిపారు. రాష్ట్రంలోని గోండు, కోయ, చెంచు వంటి తెగలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం అండగా నిలుస్తుంది.

రాబోయే ఐదేళ్లలో కనీసం వెయ్యి మంది ఆదివాసీ విద్యార్థులను పట్టభద్రులుగా చూడాలని యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రణాళిక వల్ల చదువుకు దూరంగా ఉన్న ఆదివాసీ యువత తమ కలలను సాకారం చేసుకునే అవకాశం లభిస్తుంది. ఇటీవల చదువుతో పాటే.. నెల నెలా స్టైఫండ్ పొందేందుకు ఓ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రణాళికలో చేరడానికి చివరి తేదీ ఆగస్టు 13. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ హెల్ప్ డెస్క్ లేదా వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. 40-23680333 / 040-23680555.. కాల్ సెంటర్ : 1800 5990 101 లేదా వెబ్ సైట్..ను సంప్రదించవచ్చు.

# ఎక్సైజ్ సీఐ, ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన సదస్సు..

**జమ్మికుంట,తెలంగాణ దిశ:** స్థానిక జమ్మికుంట గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో జమ్మికుంట ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సీఐ, మాధవి లత, ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. దీనిని ఉద్దేశించి ఎక్సైజ్ సీఐ,మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి యువత బానిస అవుతే వారి జీవితం సర్వనాశనం అవుతుందని అంతేకాకుండా కన్న తల్లిదండ్రుల యొక్క ఆశయాలను నిర్వీర్యం చేసిన వాళ్ళు అవుతారని డ్రగ్స్ అమ్మేటువంటి లేదా డ్రగ్స్ తీసుకునేటువంటి విద్యార్థిని విద్యార్థులు కావచ్చు ఇంకా ఎవరైనా మీకు తెలిసిన వారు ఉంటే ఎక్సైజ్ సీఐ, కు సమాచారం ఇవ్వవలసిందిగా పిల్లల్ని ఉద్దేశించి సీఐ మాధవి లత, తెలిపారు. ఈకార్యక్రమంలో కానిస్టేబుల్ వి.పెద్దన్న, మరియు ఎండి ఫయాజుద్దీన్, శైలజ, ప్రిన్సిపల్ కుమారస్వామి, అధ్యాపకులు రాగశ్రీ, అంజిబాబు, రమేష్,సాగర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...



# విద్యుత్తు వినియోగదారులపై భారం!



**హైదరాబాద్,తెలంగాణ దిశ:**టీజీఎస్‌పీడీసీఎల్ తన వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటున్నది. ఆదాయ వనరులను అన్వేషించే క్రమంలో తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు వారికి షాకిస్తున్నాయి. గతంలో 20 కిలోవాట్ల లోడ్ ఉన్న ప్రతి ఇంటికీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని నిర్ణయించారు. ఇప్పుడు మాత్రం వినియోగదారులు అడిగినంత లోడ్ ఇవ్వకుండా ఇంట్లో ఉన్న గదుల ప్రకారం విద్యుత్తు సంస్థే లోడ్‌ను నిర్ణయిస్తూ అవసరం లేకుండానే అధిక లోడ్‌ను వారిపై మోపుతున్నది. వెంచర్లు, లేఔట్లు, హైరైజ్ బిల్డింగ్‌లు నిర్మించేటప్పుడు తమకు జాగా ఇవ్వాలని కండిషన్ పెట్టినట్టు తెలిసింది. వాస్తవానికి వినియోగదారుడు కోరినంత లోడ్ మంజూరు చేసి సర్వీస్ రిలీజ్ చేయాలి. ఆర్ఎండీ ప్రకారం సదరు సర్వీసులో వాడుతున్న లోడ్ అనుమతి తీసుకున్న దానికంటే ఎక్కువ ఉంటే ఆ ప్రాంత విద్యుత్తు అధికారి తనిఖీ చేసి ఇంటిలో వాడుతున్న విద్యుత్తు పరికరాల ప్రకారం లోడ్ లెక్కించి, ఎక్కువ లోడ్ కోసం డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించాలని నోటీసులు జారీచేయాలి. నెల రోజుల అనంతరం వినియోగదారుడు వాడుతున్న లోడ్‌ను బట్టి నిర్ణయం తీసుకోవాలి. కానీ డిస్కం జారీచేసిన ఉత్వర్వుల్లో మాత్రం సింగిల్ బెడ్రూంకు రెండు కిలోవాట్లు, డబుల్ బెడ్రూంకు 5 కిలోవాట్లు, ట్రిపుల్ బెడ్రూమ్‌కు 10 కిలోవాట్లు, నాలుగు బెడ్రూంల ఇంటికి 15 కిలోవాట్ల చొప్పున లోడ్ నిర్ణయించారు. ట్రాన్స్‌ఫార్మర్ తీసుకున్న వినియోగదారుడు 11కేవీ లైన్ ఎంత దూరం ఉంటే అంత మేరకు అండర్‌గ్రౌండ్ కేబుల్ ఎస్టిమేషన్‌తో ఇవ్వాలని టీజీఎస్‌పీడీసీఎల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒక వినియోగదారుడు కొత్త కనెక్షన్ తీసుకునే ముందు 11కేవీ లైన్ నాలుగైదువందల మీటర్ల దూరం ఉంటే అక్కడికి అండర్‌గ్రౌండ్ కేబుల్ వేయడానికి ఎస్టిమేషన్ రూపొందించాలి. మధ్యలో వేరే వాళ్ల ప్లాట్లు ఉంటే వాటిలో తవ్వకాలు సాధ్యపడవు. నడిరోడ్డుపై తవ్వుతామంటే జీహెచ్ఎంసీ ఒప్పుకోదు. ఇలా అన్ని రకాల సమస్యలు ఉంటాయి. డిస్కం అధికారులు గత ఇరవై నెలల కాలంలో జారీచేస్తున్న ఉత్తర్వులు, తీసుకుంటున్న నిర్ణయాలు వినియోగదారులపై భారాన్ని మోపుతున్నాయి. ఒకవైపు గదుల వారీగా లోడ్ నిర్ణయిస్తామని చెప్పిన డిస్కం గతంలో 20 కేవీ దాటితే ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలంటూ ఆదేశాలిచ్చింది. అంతేకాకుండా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని మల్టీస్టోర్డ్ బిల్డింగులు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, ఓపెన్‌ప్లాట్ లేఔట్లకు లోడ్ ఇవ్వాలంటే సబ్‌స్టేషన్లు నిర్మించాలంటూ డీజీఎస్‌పీడీసీఎల్‌కు 800 నుంచి 1500 చదరపు గజాలు కేటాయించాలని గతంలో మరో ఉత్తర్వులిచ్చింది. ఇవన్నీ ఒక ఎత్తైతే కాంట్రాక్టర్లకు గానీ, విద్యుత్తు సిబ్బందికి గానీ ఇస్తున్న ఉత్తర్వుల్లో చాలావరకు అమలుచేయలేని పరిస్థితి ఉందని, కేబుల్ లేని పరిస్థితుల్లో సమ్మర్ యాక్షన్ ప్లాన్ చేయలేకపోవడమేనని దీనికి ఉదాహరణగా కాంట్రాక్టర్లు చెప్తున్నారు. అధికారులు జారీచేసిన ఉత్వర్వుల్లో గదుల వారీ లోడ్ పెంచడానికి పేర్కొన్న నిబంధనలు హాస్యాస్పదంగా ఉన్నాయని కాంట్రాక్టర్లు అంటున్నారు. ఇటీవల జరుగుతున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో గదుల ప్రకారం లోడ్ ఇవ్వాల ని నిర్ణయిస్తున్నట్టు ఎస్‌పీడీసీఎల్ జారీచేసిన ఉత్తర్వులో పేర్కొనడం గమనార్హం. ఇటీవల కాలంలో జరిగిన అన్ని అగ్ని ప్రమాదాలకు లోడ్ కంటే అందులో వాడిన పాత కేబుళ్లే కారణమని తేలింది. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రెవెన్యూ అధికారులతో మాట్లాడి వారి సమన్వయంతో చేయాల్సిన చోట ఇప్పుడు ఈ నిర్ణయం ఏంటంటూ వెంచర్ల నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. దక్షిణ డిస్కం తాను ఒక కొత్త కనెక్షన్ ఇచ్చే సందర్భంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తో పాటు జీహెచ్ఎంసీ పర్మిషన్, ఎన్‌వోసీ, ఓసీ తదితర సర్టిఫికెట్లు చూస్తుంది. కానీ గత ఆరు తరాలకు సంబంధించిన డాక్యుమెంట్లు కావాలని అడిగిన సందర్భం మాత్రం ఒక్క డిస్కంకే చెల్లిందని, సంబంధిత అధికారులు ఏదో ఒక సాకు చూపి కనెక్షన్లు ఇవ్వకుండా సతాయించడానికే ఇలా వ్యవహరిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. అసలు ఆరుతరాల డాక్యుమెంట్స్ వీరికి ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

# ఉత్తరాంధ్ర వెలుగులు

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ:**ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ విమానాశ్రయానికి ముహూర్తం ఖరారయింది. 2026లోనే ఈ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రిగా ఇదే ప్రాంతానికి చెందిన యువ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఉండటంతో ఇక ఈ పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయడానికి అధికారులు రేయింబవళ్లూ కష్టపడుతున్నారు. మంత్రి ఇలాకాలో అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తి చేసి వీలయితే ప్రధాని నరేంద్ర మోదీ చేత ప్రారంభించాలన్న ఆలోచనలో ఉన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. అయితే విశాఖపట్నం ఎయిర్ పోర్టుకు ప్రత్యామ్నాయంగా ఈ భోగాపురం విమానాశ్రయం రూపుదిద్దుకోవడం, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుగా మారడంతో విమానల సంఖ్య కూడా భారీగా పెరిగే అవకాశముంది. ఇతరదేశాలకు వెళ్లాలంటే ప్రస్తుతం హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరుకు వచ్చివెళ్లాల్సిఉంది. కానీ ఇకపై ఈ విమానాశ్రయం నుంచి రద్దీని బట్టి నేరుగా ఇతరదేశాలకు విమానాలను ప్రయివేటు సంస్థలు నడిపే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయలేరు. దీనివల్లసమయం తగ్గడంతో పాటు ప్రయాణ ఖర్చు కూడా తగ్గుతుందని చెబుతున్నారు. ఇక భోగాపురం విమానాశ్రయం పనులు వేగంగా పూర్తి కావస్తుండటంతో ఆచుట్టు పక్కల ప్రాంతాల్లో భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి...

అక్కడ భూములు కొనుగోలు చేయలేని పరిస్థితి. అనేక రియల్ ఎస్టేట్ సంస్థలు వెలిశాయి. వెంచర్లు వేయడంతో చకచక అమ్ముడుపోయాయి. దీంతో పాటు భోగాపురం విమానాశ్రయం రాకతో చుట్టు పక్కల ప్రాంతాలు కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఏపీ స్కూబా డైవింగ్ సంస్థకు చింతపల్లి తీరంలో టూరిజం కాటేజీలను కేటాయించారు. ఈ మేరకు కాటేజీల పునర్నిర్మాణం జరుగుతోంది. నాలుగున్నర ఎకరాల్లో దీనిని చేపట్టారు. ఏపీ ప్రభుత్వం పర్యాటక శాఖకు 80 ఎకరాల భూమిని కేటాయించింది.

ఈ 80 ఎకరాల భూమిలో.. ఒబెరాయ్ సంస్థకు 40 ఎకరాలు.. మైకేర్ సంస్థకు 40 ఎకరాలు చొప్పున ఇచ్చారు. వీటికి తోడుగా ఫైవ్ స్టార్ హోటల్స్ కూడా రానున్నాయి. భోగాపురం, భీమిలి మండలాల్లో ఏర్పాటు అవుతున్నాయి. జీఎంఆర్ సంస్థ 500 కోట్లతో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ఆనుకుని ఫైవ్ స్టార్ హోటల్ నిర్మించనుంది. వంద కోట్ల రూపాయలతో ఓ ప్రైవేట్ బీచ్ ఫ్రంట్ రిసార్ట్ నిర్మాణం కూడా మొదలైంది. దాదాపుగా రూ. 150 కోట్లతో ఎయిర్‌పోర్ట్ దగ్గర కన్వెన్షన్ సెంటర్ కూడా ఏర్పాటు కానుంది. ఇప్పటికే తాజ్ హోటల్‌ను భీమిలి మండలంలో నిర్మించాలని నిర్ణయించడంతో ఇక ఇక్కడ అభివద్ధిని ఆపడంఎవరి తరమూ కాదు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ఒకవైపు 16వ జాతీయ రహదారి ఉండటం, మరోవైపు అందమైన,

అందర్నీ ఆకట్టుకునే సముద్రతీరం కూడా ఉండటంతో అదనపు ఆకర్షణగా మారనుంది. వీఎంఆర్‌డీఏతో పాటు ప్రభుత్వ శాఖలు ప్రయాణికులు సులువుగా చేరుకోవడానికి వీలుగా పదిహేను లింక్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. విశాఖపట్నం తీర రోడ్డును కూడా ఆరు వరుసలుగా విస్తరించాలని భావిస్తున్నారు. దీంతో పాటు భోగాపురం విమానాశ్రయం దగ్గర వంద ఎకరాల్లో ఐటీ కంపెనీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది ప్రభుత్వం. భోగాపురంతో పాటుగా ఆనందపురం, భీమిలి, పూసపాటిరేగ, తగరపువలస వంటి ప్రాంతాల్లో టౌన్‌షిప్‌ల నిర్మాణానికి రియల్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందడనడంలో అతిశయోక్తి లేదు.


# ఫ్లోటింగ్ బోట్... డబుల్ డెక్కర్..!

## పర్యాటకుల కోసం ప్రత్యేకంగా..




**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** రాజకీయాల్లో ప్రభుత్వాల పని తీరుపై రకరకాలుగా చర్చ నడుస్తుంటుంది. పాలకుల తీరు, విధానాలపై కూడా ప్రజలు చర్చించుకుంటారు. నేతల సమర్థతపై మాట్లాడుతుంటారు. ఇప్పుడు ఏపీలో అటువంటి చర్చ ఒకటి నడుస్తోంది. విశాఖలో పర్యాటకుల కోసం డబుల్ డెక్కర్ బస్సులను ఏర్పాటు చేసింది ఏపీ పర్యాటక శాఖ. ఈరోజే ఆ బస్సులను ప్రారంభించారు ఏపీ సీఎం చంద్రబాబు. విశాఖ నగరంలో పర్యాటకుల కోసం ప్రత్యేకంగా తిరిగే ఈ డబుల్ డెక్కర్ బస్సుల్లో.. 24 గంటల ప్రయాణానికి కేవలం 250 రూపాయల టికెట్ నిర్ధారించారు. అయితే రోజంతా ఈ డబుల్ డెక్కర్ లో ప్రయాణానికి తొలుత 500 రూపాయలుగా పర్యాటకశాఖ టికెట్ ధరగా నిర్ణయించింది. కానీ చంద్రబాబు ప్రారంభోత్సవం చేసిన అనంతరం.. దానిని సగానికి తగ్గించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. మిగతా 250 రూపాయల టికెట్ ధరను ప్రభుత్వ భరిస్తుందని.. పర్యాటకులకు రాయితీ కింద అందిస్తామని ప్రకటన చేశారు. ఇదే సమయంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పర్యాటక విధానం ఒకటి ఎక్కువమంది గుర్తు చేస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో విశాఖ బీచ్ లో పర్యాటక అభివృద్ధికి సంబంధించిన ఏర్పాట్లు జరిగాయి. ఆర్కే బీచ్ లో సుమారు నాలుగు కోట్ల రూపాయల ఖర్చుతో.. సముద్రపు అలలపై తెలియాడే చిన్న ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయించారు. అది తీరం నుంచి సుమారు 100 నుంచి 200 అడుగుల సముద్రంలో నీళ్లపై తెలియాడుతూ ఉంటుంది. అయితే అది మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలింది. ఏర్పాటు చేసిన రెండు రోజులకే ముక్కలు ముక్కలుగా మారింది. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాన్ని బయటపెట్టింది. కేరళ తీరంలో ఉండే ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ను ఏపీకి పరిచయం చేశారు జగన్. కానీ కేరళలో అలల తాకిడి తక్కువగా ఉంటుంది. అక్కడైతే సరిపోతుంది కానీ విశాఖలో.. అలలు ప్రమాదకరంగా ఉంటాయి. ఓవైపు ఇక్కడి అలలు ప్రమాదకరం అని బోర్డులు ఉండగా.. దాని చెంతనే ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జి అప్పట్లో ఏర్పాటు చేయడం కూడా విమర్శలకు తావిచ్చింది. అప్పట్లో ఫ్లోటింగ్ బ్రిడ్జికి ప్రభుత్వం కేటాయించిన నిధులు నీటి పాలయ్యాయి. తాజాగా విశాఖలో పర్యాటక ప్రాంతాలన్నీ కలుపుతూ ఈ డబుల్ డెక్కర్ బస్సులను ఏర్పాటు చేసింది ఏపీ ప్రభుత్వం. విశాఖ ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు వ్యాపించి ఉంది. దారి పొడవునా ఎన్నెన్నో బీచ్ పార్కులు, వ్యూ పాయింట్స్ ఎన్నో ఉన్నాయి. వాటన్నింటినీ సందర్శించడానికి వీలుగా సీఎం చంద్రబాబు సూచనల మేరకు పర్యాటకశాఖ డబుల్ డెక్కర్ బస్సులను ఏర్పాటు చేసింది. వీటికి వచ్చే ఆదరణబట్టి మరిన్ని బస్సులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. విశాఖ ప్రజలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు.. ఈ డబ్బులు డెక్కర్ బస్సుల్లో బీచ్ పార్కులు చూసేందుకు అవకాశం కలుగుతుంది. జగన్ నాలుగు కోట్ల రూపాయలతో ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటు చేయగా.. రెండు రోజులకే ముక్కలయింది. కానీ చంద్రబాబు అదే నాలుగు కోట్ల రూపాయలతో రెండు డబుల్ డెక్కర్ బస్సులను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. తొలి రోజే దీనికి విశేష ఆదరణ లభించింది. అందుకే ఇప్పుడు జగన్ విధానం వర్సెస్ చంద్రబాబు విధానం అన్నట్టు పోటీ నడుస్తోంది. తప్పకుండా డబ్బులు డెక్కర్ వైపే అందరూ మొగ్గు చూపుతారు కూడా. ఎందుకంటే ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ఏర్పాటు చేసిన రెండు రోజులకే అది ముక్కలైంది కనుక.. విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ఇప్పటికే అక్కడ పర్యాటక స్థలాలు ఎన్నో ఉన్నాయి. పెద్ద ఎత్తున విశాఖకు పర్యాటకులు వస్తుంటారు. దీంతో వారికి మరింతగా సౌలభ్యత కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం నడుం బిగించింది. డబుల్ డెక్కర్ బస్సులను అందుబాటులోకి తెచ్చింది. హాప్ ఆన్ హాప్ ఆఫ్ బస్సుల పేరిట రెండు డబుల్ డెక్కర్ బస్సులు ఏర్పాటు చేయగా.. వాటిని ఈరోజు సీఎం చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి ఆ బస్సులోనే ప్రయాణించారు. ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకు 16 కిలోమీటర్ల మేర పర్యాటక ప్రాంతాల్లో ఈ ప్రత్యేక బస్సులు తిరుగుతాయి. ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ఎలక్ట్రికల్ డబుల్ డెక్కర్ బస్సుల్లో స్వయంగా సీఎం చంద్రబాబు కొంత దూరం ప్రయాణించారు. ప్రత్యేకంగా పర్యాటకుల కోసమే ఈ డబ్బులు డెక్కర్ బస్సులను అందుబాటులోకి తెచ్చారు. 24 గంటలపాటు ఒకే టికెట్టు ప్రయాణించే సౌలభ్యత కల్పించారు టికెట్ చార్జీ 500 రూపాయలుగా నిర్ణయించారు. అయితే అందులో సగం మొత్తాన్ని ప్రభుత్వమే భరించనుంది. కేవలం 250 రూపాయలకే 24 గంటలపాటు ఈ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చు అన్నమాట. నిజంగా ఇది పర్యాటకులకు ఒక వరమే. ఇప్పటికే పర్యాటక రంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రయత్నిస్తోంది కూటమి ప్రభుత్వం.

# ప్రతి పదివేల మందికి ఒక టాయ్ లెట్...!







**హైదరాబాద్,తెలంగాణ దిశ:**పబ్లిక్ టాయిలెట్లు సరిగా లేక హైదరాబాద్‌లో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు 10 వేల మందికి ఒక టాయిలెట్ మాత్రమే అందుబాటులో ఉంది. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. గతంలో ప్రారంభించిన అనేక టాయిలెట్లు దయనీయ స్థితిలో ఉన్నాయి. చెత్త పేరుకుపోయి, తలుపులు విరిగి, పనిరాకుండా పడి ఉన్నాయి. సులభ్ కాంప్లెక్సుల నిర్వహణపై కొంత సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నార్వే, టర్కీ, జపాన్ వంటి దేశాలు టాయిలెట్ల నిర్వహణ ఎందుకు మెరుగ్గా ఉందిపని మీద బయటకు వెళ్లిన సమయంలో కడుపు ఉబ్బి ఇబ్బంది పడ్డారా? కాంక్రీటు జంగల్‌లో మూత్రం పోయడానికి సరైన టాయిలెట్లు లేకపోవడం వల్ల ఇబ్బందికి గురయ్యారా?.. అయితే ఈ సమస్య ఎదుర్కొన్నది మీరొక్కరే కాదు. దేశవ్యాప్తంగా హైదరాబాద్ లాంటి మహానగరాలు, పట్టణాల్లో ఉన్న అనేక మంది ఇలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా భాగ్యనగరంలో 1.2 కోట్ల మందికి 1,385 పనిచేసే టాయిలెట్లు మాత్రమే ఉండటం పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా.. ఫలితాలు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో వందల, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా.. ఫలితం ఎందుకు రావడం లేదు? ఇలాంటి మౌలిక సదుపాయాల కల్పనలో మేటిగా ఉన్న నార్వే, టర్కీ, జపాన్ లాంటి దేశాల నుంచి మనం ఏం నేర్చుకోవాలి అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం. హైదరాబాద్‌లో 2025 ఫిబ్రవరి నాటికి 1,386 పబ్లిక్ టాయిలెట్లు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ లెక్కన పది వేల మందికి ఒక టాయిలెట్ ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కానీ అంచనాల ప్రకారం నగరంలో 9000లకు పైగా శౌచాలయాలు ఉండాలి. 2018లో జీహెచ్ఎంసీ 7,500 టాయిలెట్లను నిర్వహించేది. ఇప్పుడు దాదాపు 80 శాతం.. నిర్లక్ష్యం, నిర్వహణ లేకపోవడం వల్ల మరుగున పడ్డాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. హైదరాబాద్‌ను బహిరంగ మలవిసర్జన రహితంగా ఇప్పటికే ప్రకటించడం. మరి భాగ్యనగరం ఓపెన్ డెఫికేష్ ఫ్రీగా ఉందా? నార్వేతో పాటు స్వీడన్, డెన్మార్క్, ఫిన్‌లాండ్, ఐస్‌లాండ్.. యురోపియన్ దేశాల్లో టాయిలెట్లను 'పబ్లిక్ డిగ్నిటీ'గా భావిస్తారు. స్వీడన్‌లో ఉన్న టాయిలెట్లు వాటి ప్రత్యేక డిజైన్‌లు, శుభ్రతకు ప్రసిద్ధి. స్టాక్‌హోమ్ వంటి నగరాల్లో సెల్ఫ్‌క్లీన్ పబ్లిక్ టాయిలెట్లు ఉంటాయి. ఒకరు వాడిన తర్వాత.. వాటికవే ఫ్లష్ చేసుకుంటాయి. డిస్‌ఇన్ఫెక్ట్ చేసుకుని.. తర్వాత ఉపయోగించే వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూసుకుంటాయి. ఫిన్‌లాండ్ రాజధాని హెల్సింకిలో టాయిలెట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆన్‌లైన్, యాప్స్ ద్వారా తెలుసుకోవచ్చు. రైల్వే స్టేషన్లు, బస్‌స్టాప్ వంటి ట్రాన్స్‌పోర్ట్ హబ్‌ల్లో టాయిలెట్లను క్లీన్గా మెయింటేన్ చేస్తారు. టర్కీలో స్క్వాట్ స్టైల్ (ఇండియన్ స్టైల్) టాయిలెట్లనే ఉపయోగిస్తారు. పబ్లిక్ ప్రాంతాల్లోనూ ఇలాంటివే ఉంటాయి. వాటిని వెస్ట్రన్ టాయిలెట్లతో మార్చకుండా.. అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఫ్లోర్‌ను వాటంతట అదే క్లీన్ చేసుకునేటట్టు ఏర్పాటు చేస్తున్నారు. సిబ్బందిని ఏర్పాటు చేసి.. ఎప్పటికప్పుడు శుభ్రత ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇక మెయింటెనెన్స్ కోసం 1-2 లిరా (రూ. 5-10 ) తీసుకుంటున్నారు. అందుకు తగ్గట్టే మెయింటెనెన్స్ ఉంటోంది. జపాన్‌లో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, పబ్లిక్ ప్రాంతాల్లో ఉన్న టాయిలెట్లు.. ఇళ్లలో ఎలా ఉంటాయో అలా శుభ్రంగా ఉంచుతారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నా.. ఫలితాలివ్వడం లేదు. హైదరాబాద్ లిమిట్స్‌లో ఉన్న పబ్లిక్ టాయిలెట్లలో.. పని చేయకుండా పడి ఉన్న 1370 టాయిలెట్లను పునరుద్ధరించడానికి 2025 జూన్‌లో ప్రతిపాదనలు సిద్ధం చేసింది జీహెచ్ఎంసీ. దీని ప్రకారం ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్స్, ఆర్‌సీసీ టాయిలెట్లు, ఈ-టాయిలెట్స్, షీ-టాయిలెట్స్, బయో టాయిలెట్స్‌ను అవి ఉన్నచోటునే రీడిజైన్, రీఫర్బిష్ చేస్తారు. బిల్డ్ అండ్ ట్రాన్స్‌ఫర్ మోడ్‌లో ఇలా చేయాలని ఆలోచించాలి. ఈ ప్రతిపాదనలను స్టాండింగ్ కమిటీ అనుమతి కోసం పంపించారు. అయితే జులై నెల చివరలో 525 టాయిలెట్లను పునరుద్ధరిస్తామని అధికారులు చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని చాలా టాయిలెట్లు దారుణ పరిస్థితిలో ఉన్నాయి. డోర్లు విరిగిపోవడం, చెత్తతో నిండిపోవడం, నీరు, డ్రైనేజీ సరిగా లేకపోవడం నిరుపయోగంగా పడి ఉన్నాయి. కొన్ని సులభ్ కాంప్లెక్సుల్లో మాత్రమే నిర్వహణ సక్రమంగా ఉంది. పబ్లిక్ టాయిలెట్లు అవసరం రోజురోజుకు పెరుగుతున్నా.. వాటిని సక్రమంగా నిర్వహించడంలో జీహెచ్ఎంసీ ఫెయిల్ అవుతోందనే విమర్శలు వస్తున్నాయి. విదేశాల్లో ఉన్నట్లు.. పట్టణ ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకునే వ్యవస్థ భారత్‌లో ఇప్పటికే ఉంది. గూగుల్ ద్వారా ఈ వివరాలు తెలుసుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ గూగుల్‌తో ఒప్పందం చేసుకుంది. స్వచ్ఛ్ భారత్ మిషన్) టాయిలెట్ అంటే సెర్చ్ చేస్తే.. అవి ఎక్కడెక్కడ ఉన్నాయో చూపిస్తుంది. వీటి నిర్వహణ గురించి కంప్లైంట్ చేయాలంటే జీహెచ్ఎంసీ యాప్, లేదా స్వచ్ఛత యాప్‌లోకి వెళ్లాలి. దీంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఒక యాప్ లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లో అన్ని రకాల పబ్లిక్ టాయిలెట్ల గురించి వివరాలు ఉండాలని, ఫిర్యాదు చేసే వ్యవస్థకు కూడా ఉండాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, వెబ్‌సైట్‌లో సరైన వివరాలు రావడం లేదు. సులభ్, పీఎఫ్‌టీ టాయిలెట్స్, సులభ్ కాంప్లెక్స్ అంటూ ఏ టాయిలెట్ రకం సెలెక్ట్ చేసుకున్నా.. ఒకే రకమైన సమాచారం వస్తోంది. ఇలా.. రూ. వందల కోట్లలో నిధులు ఖర్చు చేస్తున్నా, టెక్నాలజీ అందుబాటులో ఉన్నా హైదరాబాద్ లాంటి నగరాల్లో పబ్లిక్ టాయిలెట్ల పరిస్థితి మెరుగుపడటం లేదు. ప్రభుత్వాలు కేటాయించే నిధులు కాంట్రాక్టర్లు పక్కదారి పట్టించకుండా ఉంటే.. పైన చెప్పుకున్న దేశాల్లోలాగా పబ్లిక్ టాయిలెట్లను శుభ్రంగా ఉంచుకునే ప్రయత్నం చేయగలం. ఇప్పటికే ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నా.. అవి వేగంగా ముందుకు కదలడం లేదు. అందుకే పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే.. గతంలో అట్టహాసంగా ప్రారంభించిన పబ్లిక్ టాయిలెట్లు ప్రస్తుతం ఎలా ఉన్నాయో మనం చూస్తునే ఉన్నాయి. ఇలా జరగాలంటే ప్రజల పన్నులకు ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండాలి. నియమ నిబంధనలు ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. పౌరులు కూడా ప్రజా ఆస్తుల పట్ల సామాజిక బాధ్యతతో ప్రవర్తించాలి. పరిశుభ్రత ప్రజా ఉద్యమంగా మారే వరకు.. కడుపు ఖాళీ చేసేందుకు అవస్థలు పడాల్సిందే!

# గోనె సంచెలు ఏవీ



**గుంటూరు,తెలంగాణ దిశ:** పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తన శాఖలో జరిగే విషయాలను పట్టించుకోవడం లేదు. రైతులు గిట్టుబాటు ధర రాకపోవడంతో పాటు గోనెసంచీలు లేక అవస్థలు పడుతున్నారు. వరికి గిట్టుబాటు ధర లభించడం లేదని వాపోతు న్నారు. గత ప్రభుత్వం పై విమర్శలు చేయడం మాని నాదెండ్ల మనోహర్ రైతుల గోడును పట్టించుకోవాలని కోరుతున్నారు. దిగుబడి తగ్గడమే కాకుండా, ఖర్చు ఎక్కువయి.. గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. వరికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎకరాకు నలభై నుంచి యాభై బస్తాలు పండాల్సిన వరి, ఈ ఏడాది ఇరవై నుంచి ఇరవై ఐదు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతులు వాపోతున్నారు.ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. టోకెన్లు ఇంత వరకూ జారీ కాకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. తేమ ఎక్కువగా ఉందని అధికారులు కొనుగోలుకు తిరస్కరిస్తున్నారు. గోనె సంచిలు కూడా తమకు అందడం లేదని రైతులు చెబుతున్నారు. 48 గంటల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని హామీ ఇచ్చినప్పటికి ఇప్పటి వరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవలేదు. దీంతో కొందరు రైతులు రోడ్లపైనే ధాన్యం ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిల్లర్లు సిండికేట్ అయి రైతులను దోచుకుంటున్నారని అన్నదాతలు ఆవేశంగా చెబుతున్నారు. గ్రౌండ్ లెవెల్ లో ఈ వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తేమ 16శాతంఉంటేనే కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు షరతులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కృష్ణా జిల్లాలోనే ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గత ఏడాది 2,500నుంచి 2,700 క్వింటాల్ కు పలికిన ధరఈ ఏడాది పదిహేను వందల నుంచి పదిహేడు వందల రూపాయలకు పడిపోయిందని రైతులు చెబుతున్నారు. గిట్టుబాటు ధరలు రాకపోవడంతో రైతులు గోదాముల్లో ధాన్యాన్ని దాచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మోంథా, దిత్వా తుపాను దెబ్బకు తీవ్రంగా నష్టపోయిన రైతులు, ఎకరాకుపదివేలరూపాయల వరకూ నష్టపోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. అప్పులు ఇచ్చిన వాళ్లు తమ మీద పడి వడ్డీతో పాటు కట్టాలని హుకుం జారీ చేస్తున్నారన్నారు. నాదెండ్ల మనోహర్ ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతులను దళారులను దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# భారత్‌పై మరో దేశం 50 శాతం సుంకాలు..

## వాణిజ్య యుద్ధానికి దిగిన మెక్సికో భారతీయ వస్తువులపై 50% టారిఫ్



న్యూఢిల్లీ: భారతీయ దిగుమతులపై అమెరికా 50 శాతం దిగుమతి సుంకాలు విధించిన నేపథ్యంలో భారత్‌కు మరో దేశం నుంచి కూడా పన్ను పోటు ఎదురైంది. భారత్ నుంచి దిగుమతి అయ్యే అనేక వస్తువులపై 50 శాతం సుంకాలు విధించేందుకు మెక్సికో సెనేట్ బుధవారం ఆమోదించింది. భారత్‌తోపాటు చైనా, మరికొన్ని ఆసియన్ దేశాలపై కూడా దీని ప్రభావం ఉండనున్నది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సంతుష్టి పరిచేందుకే మెక్సికో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాయిటర్స్ అభిప్రాయపడింది. 2026 జనవరి నుంచి అమల్లోకి రానున్న సుంకాల పెంపు నిర్ణయంతో ఆటోలు, ఆటో విడిభాగాలు, జౌళి, ప్లాస్టిక్స్, ఉక్కు వంటి వస్తువులపై 50 శాతం దిగుమతి సుంకం పడనున్నది. మెక్సికోతో వాణిజ్య ఒప్పందం లేని దేశాలపై దిగుమతి సుంకాన్ని 50 శాతం విధించాలని మెక్సికో సెనేట్ తీర్మానించింది. దీని వల్ల భారత్, దక్షిణ కొరియా, చైనా, థాయ్‌లాండ్, ఇండోనేషియా నష్టపోనున్నాయి.

వచ్చేఏడాది అదనంగా రూ.376 కోట్ల డాలర్లు (దాదాపు రూ. 33, 940 కోట్లు) అదనపు ఆదాయాన్ని ఆర్జించాలని మెక్సికో భావిస్తోంది. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ నిర్ణయించుకున్న సమయంలోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. అయితే అమెరికా-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందంపై అమెరికాలో సమీక్ష జరగనున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునేందుకే మెక్సికో ఈ చర్యను చేపట్టినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మెక్సికో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అమెరికా ప్రస్తుతం ఉంది.

ఈ ఏడాది ప్రారంభంలో చైనీస్ వస్తువులపై మెక్సికో భారీగా సుంకాలు విధించింది. అయినప్పటికీ ట్రంప్ మాత్రం షేన్‌బామ్ ప్రభుత్వంపై గత కొన్ని నెలలుగా తీవ్ర ఆగ్రహం ప్రదర్శిస్తున్నారు. మెక్సికన్ స్టీల్, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించిన ట్రంప్ పియోయిడ్ ఫెంటానిల్(మత్తు పదార్థం) ప్రవాహాన్ని అడ్డుకోవడంలో విఫలమైనందుకు అదనంగా మరో 25 శాతం సుంకాలు విధిస్తామని మెక్సికోను బెదిరించారు.

అంతేగాక అమెరికన్ రైతులకు సాగునీరును అందించే 1944 నాటి ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు మెక్సికోపై మరో 5 శాతం సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

భారత్‌పై మెక్సికో ప్రభావం:

భారతీయ దిగుమతులపై 50 శాతం సుంకాలు విధించాలన్న మెక్సికో నిర్ణయం ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపనున్నది. 2024లో భారతీయ దిగుమతులు అత్యధికంగా 1,170కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. మెక్సికన్ ఎగుమతులకు భారత్ 9వగమ్యస్థానంగా ఉంది. ప్రస్తుతం మెక్సికో నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువుల కన్నా భారత్ నుంచి ఎగుమతి అవుతున్న వస్తువులేఅధికంగా ఉన్నాయి. ఉదాహరణకు 2024లోమెక్సికోకు భారతీయ ఎగుమతుల విలువ 890కోట్ల డాలర్లు ఉండగా దిగుమ తుల విలువ280 కోట్ల డాలర్లు మాత్రమే ఉంది. భారత్‌కు అనుకూ లంగా వాణిజ్య వ్యత్యాసం ఉంది. 2024లో భారత్ నుంచి ప్రధానం గా మోటారు కార్లు, ఆటో విడిభాగాలు, ఇతర ప్యాసింజర్ వాహనాలను మెక్సికోదిగుమతి చేసుకుంది. ఈ వస్తువులపై మెక్సికో ఇప్పుడు భారీగా సుంకాలు విధించడంతో వచ్చే ఏడాది ఈ వస్తువుల దిగుమతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

# ఇంకా పదవెప్పుడు..

**విజయవాడ,తెలంగాణ దిశ :** మెగా బ్రదర్ నాగబాబుకి మంత్రి పదవి ఇస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించి ఏడాది అయింది. పోయిన సంవత్సరం సరిగ్గా ఇదే రోజున అంటే 09.12.2024 న ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో పార్టీ అధికారిక లెటర్ హెడ్ పై ఈ ప్రకటన చేశారు. అప్పటికి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో ఒకటి టీడీపీ, ఒకటి జనసేన, మరొకటి బీజేపీ తీసుకుంటాయని ప్రచారం జరిగింది. వాటిలో టీడీపీ నుండి బీద మస్తాన్ రావు, బీజేపీ నుండి కృష్ణయ్య, జనసేన నుండి కొణిదెల నాగబాబు అని అందరూ ఫిక్స్ అయ్యారు.అనూహ్యంగా టీడీపీ నుండి మరోపేరు సాన సతీష్ పేరు సీన్ లోకి రావడం తో టీడీపీ రెండు ఎంపీ స్థానాలు తీసుకొంది. సాన సతీష్ రాజ్యసభ సీటు వెనుకాల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ ఆశీస్సులు ఉన్నాయన్న ప్రచారం గుప్పుమంది. జగన్ హయాంలో చంద్రబాబు జైలు కి వెళ్ళినప్పుడు ఢిల్లీ వ్యవహారాల్లో లోకేష్ కి అండగా సాన సతీష్ ఉన్నారని అందుకే ఆయనకీ ఆ పదవి దక్కింది అని టీడీపీ లో చాలామంది గుసగుసలాడారు. ఇక నాగబాబు కి రాజ్యసభ సీటు ఖాళీ లేకపోవడం తో ఆయనను మంత్రిమండలి లోనికి తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా లిఖిత పూర్వకం గా ప్రకటించారు. అయితే అది ఇప్పటికీ ఆచరణ లోనికి మాత్రం రాలేదు2019-24 మధ్యలో జనసేన లో నాగబాబు కీలక పాత్ర పోషించారు. 2019 ఎన్నికల్లో నరసాపురం నుండి ఎంపీ గా పోటీ చేసి అప్పటి వైసీపీ ఎంపీ అభ్యర్థి రఘు రామ కృష్ణం రాజు చేతిలో ఓడిపోయారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా 2024 వరకూ పార్టీ తరపున కీలకం గా ఉంటూ వచ్చారు. 2024, ఎన్నికల్లో నరసాపురం నుండి పోటీ చేద్దాం అనుకుంటే అది కూటమి కోసం త్యాగం చెయ్యాల్సి వచ్చింది. అనకాపల్లి నుండి పోటీ అనుకున్నా చివరి క్షణంలో అది బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ కోసం వదిలిపెట్టాల్సి వచ్చింది. మధ్యలో ఎమ్మెల్యే గా పోటీ చేద్దాం అనుకున్నా అదికూడా కుదరలేదు. దానితో రాజ్యసభ కు పంపుదామని పవన్ భావించారు. కానీ అదికూడా సాన సతీష్ కోసం వదలాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వరుసగా నాగబాబుకి హ్యాండ్ ఇస్తూ ఉండడం పై అభిమానుల్లో ఏర్పడ్డ అసంతృప్తి ని చల్లార్చడానికి ఎన్నడూ లేని విధంగా రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన లో భాగం గానే నాగబాబు కి మంత్రి పదవి అంటూ చంద్రబాబు నాయుడు స్పష్టత ఇచ్చారు. కానీ ఏడాది దాటినా అది ప్రకటన లానే ఉండిపోయింది. అయితే ఆయన్ను ఎమ్మెల్సీ ని చేసి శాసన మండలి కి పంపారు.ఏపీ క్యాబినెట్ లో ప్రస్తుతం ఒక్క ఖాళీనే ఉంది. దానిని నాగబాబు తో భర్తీ చెయ్యాలని చంద్రబాబు అనుకున్నా చివరి నిముషం లో జన సేనాని పవన్ కళ్యాణ్ పునరాలోచన లో పడ్డారని జనసేన వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే జనసేన నుండి పవన్ కళ్యాణ్, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ మంత్రులు గా ఉన్నారు. వీరిలో పవన్, దుర్గేష్ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. ఇప్పుడు నాగబాబు కి మంత్రి పదవి అంటే ఉన్న నాలుగు మంత్రి పదవుల్లో మూడు ఒకే సామాజిక వర్గానికి ఇచ్చినట్టు అవుతుంది. దానివల్ల జనసేన కు పూర్తిగా కులము ద్ర పడిపోయే అవకాశం ఉంటుందని ప్రత్యర్థులకు ఆ అవకాశం ఇవ్వడం ఎందుకు అనేది పవన్ కళ్యాణ్ ఆలోచన గా చెబుతుంటారు ఎనలిస్ట్ లు.ఒకానొక సందర్బంలో పవన్ కూడా ఇండైరెక్ట్ గా ఇదే మాట చెప్పే ప్రయత్నం కూడా చేశారు. దానితో నాగబాబుకు మంత్రి పదవి అనేది రియాలిటీ కి దూరంగా ఉండిపోయింది. మరి త్వరలో జరుగబోతోందిఅని ప్రచారం లో ఉన్న మంత్రి మండలి పునర్వవస్థీకరణ లో అన్నా నాగబాబు కి మంత్రి పదవి లభిస్తుందా లేదా అన్నది ఏపీ పాలిటిక్స్ లో ఆసక్తి కర చర్చ లా మారింది.

# పడకేసిన రియల్ ఎస్టేట్..



**అమరావతి,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న నిర్ణయాలతో అమరావతి ప్రాంత రైతులకు సంబంధిం చిన భూముల విలువ ఢమాల్ అని పడిపోయింది. 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత అమరావతి రాజధానిగా ప్రకటించిన సమయంలో రాజధాని ప్రాంతంలో ఎకరం భూమి నలభై లక్ష రూపాయలు చేసే భూమి ఒక్కసారిగా ఎనభై లక్షల రూపాయల వరకూ పలికింది. రాజధాని ఇక్కడకు వస్తుందని తెలిసి అనేక మంది కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో రాజధాని ప్రాంతమే కాకుండా గుంటూరు జిల్లాలోని భూములకు కూడా ఒక్కసారి ధరలు పెరిగాయి. అక్కడకు కార్లలో అధిక సంఖ్యలో రియల్ వ్యాపారులు వచ్చి భూములుబేరాలు ఆడి కొనేవారు. కానీ నేడు బేరమాడే వారు కూడా లేరు.అయితే 2019 ఎన్నికలలో జగన్ వచ్చి మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చిన వెంటనే తిరిగి ఎకరం భూమి నలభై లక్షల రూపాయలకు చేరింది.దీంతో ఈ ప్రాంత వాసులు ముఖ్యమంత్రిగా చంద్రబాబు తిరిగి ఎన్నికయ్యేందుకు దోహదపడ్డారు. వారి ఆందోళనలు ఒకరకంగా పార్టీకి అనుకూలంగా మారాయి. అయితే చంద్రబాబు వచ్చిన తర్వాత అనుసరిస్తున్న పద్ధతులు, వరసగా భూ సమీకరణలు చేస్తుండటంతో మళ్లీ రియల్ ఎస్టేట్ స్తబ్దత నెలకొనిందంటున్నారు. గతంలో హైదరాబాద్ నుంచి వచ్చిన కొందరు రియల్ వ్యాపారులు ఇక్కడకు వచ్చి భూములు కొనుగోలు చేసి వెంచర్లను ఏర్పాటు చేశారు. కొందరు అపార్ట్ మెంట్లు నిర్మించారు. నేడు అపార్ట్ మెంట్ల ధరలు కూడా గతంలో మాదిరిగా లేవంటున్నారు. గతంలో అమరావతి రాజధాని హైప్ చూసి భూమిని కొనుగోలు చేసిన వారు ఇప్పుడు అమ్మాలన్నా కొనేవారు లేరని వాపోతున్నారు.అమరావతిలో తొలి విడత ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చిన భూములుఇంత వరకూ అభివృద్ధి చేయకుండా రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం వెళ్లడం, మూడో విడత కూడా ఉందనిచెప్ప డంతో భూముల ధరలు ఢమాల్ అంటున్నాయట. ఇందుకు అమరావతికిచెందిన ఒక రైతుఉదాహరణ చెప్పారు.ఎక్కడైనా ఒక వీధిలో ఒక షాపు ఉంటే దానికి గిరాకీ ఉంటుంది.అదే వీధిలో మరొక షాపు ఏర్పాటయితే గిరాకీ తగ్గిపోతుంది. ఇప్పుడు రెండోసారి భూ సమీకరణ విషయంలో తాము కూడా ఇలాగే అన్యాయానికి గురవుతున్నామని చెబుతున్నారు. తాము రాజధానికి వ్యతిరేకం కాదంటూనే తమకు ప్లాట్లను అభివృద్ఇ చేయకుండానే మరొకరికి ప్లాట్లు కేటాయించడంతో భూముల ధరలు తగ్గిపోయాయని, జేఏసీ నేతలతో మాట్లాడి ఫలితం లేదని, గ్రామ సభలు జరిపి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించాలి కదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

# సిటీలో 1500 కి.మీ. మేర 'పీపుల్ ఫస్ట్ కారిడార్లు'

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా మార్చేం దుకు తెలంగాణ ప్రభుత్వం 'విజన్-2047'తో దూసుకుపోతోంది. మెరుగైన రవాణా, పారిశ్రామిక అభివృద్ధి, వారసత్వ సంపద పరిరక్షణ, పౌర సౌకర్యాలు, పచ్చదనం పెంపు వంటి అంశాలపై దృష్టి సారించారు. మూసీ నదిని సుందరీకరించి 24 గంటల తాగునీటి సరఫరా లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. హైదరాబాద్‌ను ఆవిష్కరణలకు, పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దడమే దీని ముఖ్య ఉద్దేశ్యం.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047 పేరుతో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలపడానికి బృహత్తర ప్రణాళికను రూపొందించింది. దేశంలోనే కాదు, ప్రపంచంలోని పది అగ్రగామి ఆవిష్కరణలకు, పెట్టుబడులకు, అత్యుత్తమ జీవన ప్రమాణాలకు కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్నది విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యం. కోర్ అర్బన్ రీజియన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రణాళికలను ప్రభుత్వం నిర్దేశించింది. ఈ విజన్ ప్రధానంగా మొబిలిటీ, పారిశ్రామిక అభివృద్ధి, వారసత్వ సంపద, పౌర సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ అనే ఐదు కీలక స్తంభాలపై ఆధారపడి ఉంది.నగర భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో సమీకృత రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ సర్వీసులను అనుసంధానించడం ద్వారా ప్రజలకు మెరుగైన ప్రయాణ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం కామన్ మొబిలిటీ కార్డును అందుబాటులోకి తీసుకురానున్నారు. అంతేకాక, ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ప్రత్యేక మార్గాల్లో బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్) ను ఏర్పాటు చేయనున్నారు. ప్రజారవాణాను ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించడం ద్వారా శివారు ప్రాంతాల ప్రజలకు సౌలభ్యం కల్పించనున్నారు. ముఖ్యంగా, రవాణా ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజారవాణా మార్గాల నుంచి కేవలం 15 నిమిషాల్లో చేరుకునే దూరంలో నిర్మించే కార్యాలయాలు, వాణిజ్య భవనాలు, నివాసాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది.నగరంలో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి 1,000 కి.మీ. వాకింగ్, సైక్లింగ్ కారిడార్లు, పాదచారుల కోసం అంతరాయాలు లేని పాదబాటలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, స్కైవాక్‌లను నిర్మించనున్నారు. నగరవ్యాప్తంగా 1500 కి.మీ. మేర 'పీపుల్ ఫస్ట్ కారిడార్ల'ను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ రద్దీ లేని, సురక్షితమైన వీధులను డిజైన్ చేయనున్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న పారిశ్రామిక భూములను బహుళ వినియోగానికి అనువుగా అభివృద్ధి చేయడానికి బ్లౌన్‌ఫీల్డ్ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించనున్నారు. పర్యాటక రంగ అభివృద్ధి లక్ష్యంగా వారసత్వ సంపద సంరక్షణకు చర్యలు తీసుకుంటారు. పాతబస్తీకి యునెస్కో వరల్డ్ హెరిటేజ్ హోదా సాధించడాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. 100 పార్కులను, ప్లాజాలను సాంస్కృతిక కేంద్రాలుగా తీర్చిదిద్ది, భారీ ఈవెంట్లకు వేదికలుగా మారుస్తారు. నైట్ ఎకానమీని పెంచడానికి సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్, జలాశయాల వద్ద, ఐటీ కారిడార్లలో 24 గంటలు పనిచేసేలా హ్యాకర్స్ సెంటర్స్ 2.0 మరియు ఆధునిక మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు.

పర్యావరణ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని బ్లూ-గ్రీన్ హైదరాబాద్-2047 పేరుతో ప్రత్యేక ప్రణాళికను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా మూసీ నదిని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతూ మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేపడతారు. పశ్చిమం నుంచి తూర్పు వరకు 35-40 కి.మీ. పొడవునా నడక మార్గాలు, వాటర్ ట్యాక్సీ డాక్స్, జెట్టీలు, వంతెనలు, వ్యూయింగ్ డెక్‌లతో సుందరీకరణ చేపట్టనున్నారు. 100 చెరువులను సుందరీకరించడంతో పాటు హుస్సేన్‌సాగర్ 2.0 ద్వారా దానిని మరింత అభివృద్ధి చేస్తారు. జలాశయాల వద్ద సైక్లింగ్, వాకింగ్ లూప్స్, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, రెయిన్ గార్డెన్స్ ఏర్పాటు చేస్తారు. 1500 కి.మీ. అర్బన్ ఫారెస్ట్ బ్లాక్స్, స్ట్రీట్ కనోపీ, నడక మార్గాలు ఏర్పాటు చేయడం ద్వారా నగరంలో పచ్చదనాన్ని పెంచుతారు. ఈ విజన్‌లో అత్యంత ముఖ్యమైన అంశం ఏంటంటే, ప్రజలకు 24 గంటలూ తాగునీరు సరఫరా చేసే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది.

# పెమ్మసాని కొత్త రికార్డ్

**గుంటూరు,తెలంగాణ దిశ :** మోడీ 3.0 ప్రభుత్వంలోని కొత్త మంత్రుల్లో ఆస్తుల పరంగా అతి ధనవంతుడిగా నిలిచిన వ్యక్తి గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ అనే సంగతి తెలిసిందే. ఆయన వెల్లడించిన రూ.5,705 కోట్ల ఆస్తులు అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమ య్యాయి. ప్రస్తుతం గ్రామీణాభివృద్ధి మరియు సమాచార శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పెమ్మసాని మరో విశిష్ట రికార్డు సొంతం చేసుకున్నారు.ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన 25 మంది ఎంపీల పనితీరును పరిశీలించిన ఒక తాజా సర్వేలో పె మ్మసాని 8.9 స్కోర్ సాధించి మొదటి స్థానంలో నిలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కొత్తగా ఎన్నికైన ఎంపీగా, తొలి పదవీకాలంలోనే కేంద్ర మంత్రిగా ఉన్న వ్యక్తి ఇంత మంచి పనితీరు ప్రదర్శించడం ఆశ్చర్యంగా భావిస్తున్నారు. బుర్రిపాలెం లో జన్మించిన పెమ్మసాని ఉస్మానియా యూనివర్సిటీ లో వైద్య విద్య పూర్తిచేసుకుని అమెరికాకు వెళ్లారు. అక్కడ 'యూ వరల్డ్' అనే అంతర్జాతీయ స్థాయి వైద్య విద్యా సంస్థను స్థాపించి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది విద్యార్థులకు మార్గదర్శకుడయ్యారు. 2024 సాధారణ ఎన్నికల సమయంలో అమెరికాలోని స్థిరమైన కెరీర్‌ను విడిచి భారత రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ఆయన ధైర్యసాహసాలకు నిదర్శనం.గుంటూరు పార్లమెంట్ స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన 3,44,695 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించి కొత్త రికార్డు సృష్టించారు. రాజకీయాల్లో కొత్త అయినప్పటికీ ప్రజల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్లమెంటరీ బాధ్యతలు ఇవన్నిట్లోనూ ఆయన చూపుతున్న నిబద్ధతే ఈ రికార్డు సాధించే కారణమని విశ్లేషకుల అభిప్రాయం.ఇక అమరావతి రాజధాని ప్రాంతం గుంటూరు ఎంపీ పరిధిలో ఉండటం వల్ల అక్కడి రైతులకు బలమైన మద్దతు అవసరం. ఈ నేపథ్యంలో పెమ్మసాని తరచూ స్థానిక రైతులతో సమావేశమై, వారి సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు. తనప్రాంత ప్రజల పట్ల ఎలాంటి రాజకీయ స్వార్థం లేకుండా



వ్యవహరించడం ఆయనకు మంచి గుర్తింపు తెచ్చింది.అదనంగా, పార్లమెంట్ తొలి సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీలు మొత్తం1,576 ప్రశ్నలను లేవనెత్తగా, అందులో 1,081 ప్రశ్నలు టీడీపీఎంపీల నుంచే రావడం గమనార్హం.సగటున ప్రతి టీడీపీ ఎంపీ 77.2 ప్రశ్నలు అడగడం, జాతీయ సగటు 46.8 కంటే చాలా ఎక్కువ. ఈ సంఖ్యలు తమ పనితీరుతో టీడీపీ ఎంపీలు ఎంత చురుకుగా ఉన్నారనే విషయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ సమష్టి కృషిలో పెమ్మసాని చంద్రశేఖర్ ముందంజలో నిలవడం సహజమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాసేవను రాజకీయాల కంటే ముందుగా పెట్టే నాయకత్వం ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టిందనే విషయం ఇప్పుడు మరింత స్పష్టమవుతోంది.

# 'ఎరువు' రాయితీ ఎలా?



- సిఎం ప్రకటనపై సందేహాలెన్నో..
- రైతుల ఆందోళనల వేడి చల్లార్చేందుకేనన్న వాదన
- వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకేనన్న విమర్శలు

**అమరావతి,తెలంగాణ దిశ :** యూరియా సహా అన్ని రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే రైతులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తామన్న టిడిపి కూటమి ప్రభుత్వ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. ఎరువులకు కేంద్రం విధించిన కోతలు, ఎరువుల సరఫరాలో ప్రభుత్వ వైఫల్యాలపై అన్నదాతల్లో నెలకొన్న ఆగ్రహావేశాలు, అసంతృప్తులను తగ్గించడానికి, ప్రస్తుతం నెలకొన్న వేడిని చల్లార్చడానికే సిఎం ఆ ప్రకటన చేశారని తెలుస్తోంది. రైతు ఎంతైతే ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తాడో, ఆ మేరకు బస్తాకు రూ.800 వంతున నగదు బదిలీ చేయనున్నట్లు సోమవారంనాటి కలెక్టర్ల కాన్ఫరెన్స్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దానికి సంబంధించి త్వరలో విధి, విధానాలు రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కాగా సిఎం ప్రకటన వెనుక ఎలాంటి నిర్దిష్ట కసరత్తు చేయలేదని, ప్రభుత్వంలో ప్రాథమిక స్థాయిలో కూడా చర్చ జరగలేదని సమాచారం. అందుకే ఏ ఎరువు వాడకాన్ని తగ్గిస్తే రూ.800 ఇస్తారో స్పష్టత కరువైంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఫోకస్ అంతా యూరి యాపైనే ఉంది. యూరియా సరఫరాలో ప్రణాళికా రహితంగా ఉన్నారంటూ ప్రభుత్వ వైఫల్యాన్ని సిఎం ఒక మేరకు అంగీకరించారు. యూరియాకే ఎక్కువ సమస్య ఏర్పడింది. కేంద్రం నుంచి అదనుకు యూరియా సరఫరా కానందువల్లనే కొరత వచ్చింది.

పిఎం ప్రణామ్ లో భాగమే: ఎరువుల సబ్సిడీని తగ్గించుకునేందుకు 2023 జూన్లో మోడీ సర్కార్ 'పిఎం-ప్రణామ్' స్కీంకు రూపకల్పన చేసింది. అంతకుముందటి మూడేళ్ల ఎరువుల వినియోగం సగటును గణించి, దానిలో కనీసం పది శాతం వినియోగం తగ్గించాలన్నది లక్ష్యం. ఆ విధంగా ఎంతైతే వినియోగం తగ్గించి సబ్సిడీని ఆదా చేస్తారో, ఆ అమౌంట్ లో సగ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రాంట్గా ఇస్తామంది. దేశ వ్యాప్తంగా ఏడాదికి కేంద్రం ఎరువుల సబ్సిడీ రూ.20 వేల కోట్లు తగ్గించుకోవాలన్నది టార్గెట్. 2023-24, 2024-25, 2025-26.. ఈ మూడేళ్లూ పిఎం ప్రణామ్ అమలులో ఉంటుంది. భవిష్యత్తులో కూడా కొనసాగుతుంది. వీలైన మేరకు ఎరువుల వాడకాన్ని తగ్గించి కేంద్రం నుంచి గ్రాంట్ పొందాలని ఎపి పోటీ పడుతున్నట్లు సమాచారం. ఈ విషయం బయటికి పొక్కేసరికి, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లో కొంత మొత్తాన్ని రైతులకు నగదు బదిలీ చేస్తామంటే రైతుల్లో ఆందోళన, వ్యతిరేకత తగ్గుతుందని కూటమి సర్కార్ ఎత్తు వేసిందని అనుకుంటున్నారు.

బేస్ లేదు: రైతు ఎంత మేర ఎరువుల వాడకాన్ని తగ్గించాడో నిర్ణయించడానికి డేటా, మెకానిజం ప్రశ్నార్థకంగా మారింది. ఏ ప్రాంతంలో ఏ పంటకు ఎంత ఎరువు ఏ ఎరువు వేయాలన్న వ్యవసాయ వర్శిటీలు, ఐసిఎఆర్ సూచనలను పరిశీలించి, దానికి ఎంత తగ్గించారో డేటా నమోదు చేస్తారని ప్రచారం సాగుతోంది. ప్రస్తుతానికి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) గణాంకాలే సరిగ్గా లేవు. వెబ్ల్యాండ్ ఆధారంగా ఇ-క్రాప్ లింక్ అంటున్నా పంటలు వేశాక ఆ నమోదులు జరుగుతున్నాయి. ఇ-క్రాప్ అనేది ఆచరణసాధ్యం కాదన్నది వాదన. రాష్ట్రంలో కౌలు వ్యవసాయం గణనీయంగా ఉంది. లక్షల ఎకరాలను లక్షలాది కౌలు రైతులు సాగు చేస్తున్నారు. ఇ-క్రాప్లో వారి పేర్లు నమోదు కావు.

వాస్తవ సాగుదారులే ఎరువులు వినియోగిస్తారు. వారందరికీ నగదు ప్రోత్సాహకం ప్రశ్నార్థకం. పిఎం-ప్రణామ్లో యూరియాతో పాటు డిఎపి, ఎంఒపి, ఎస్ఎస్పి, ఎన్పికె (కాంప్లెక్స్ ఎరువులను తగ్గించాలన్నది టార్గెట్. సిఎం చంద్రబాబు యూరియాను దృష్టిలో పెట్టుకొనే బస్తాకు రూ.800 అన్నారన్నది అధికారుల మాట. కేంద్రం యూరియాపై బస్తాకు రూ.1,700 సబ్సిడీ ఇస్తోంది కాబట్టి దానిలో సగం రైతుకు ఇన్సెంటివ్ ఇవ్వాలంటున్నారని తెలిసింది. మరి మిగతా ఎరువుల పరిస్థితేంటన్న ప్రశ్నలొస్తున్నాయి. ఎరువులను తగ్గించే రైతులకు క్యాష్ ఇన్సెంటివ్ అన్న చంద్రబాబు ప్రకటన అటు ప్రభుత్వం, అధికారుల్లో ఇటు రైతుల్లో గందరగోళానికి దారి తీసింది.

## భారత్ నుంచి డీజిల్ దిగుమతులపై ఉక్రెయిన్ ఆంక్షలు

న్యూఢిల్లీ, : భారతదేశం నుంచి చేసుకుంటున్న డీజిల్ దిగుమతులపై ఆంక్షలు విధించాలని ఉక్రెయిన్ నిర్ణయించింది, అక్టోబర్ 1 నుంచి ఇది అమలులోకి రానుంది. రష్యా నుంచి ముడి చమురుపై ఆధారపడటంపై ఆందోళనలు చెలరేగాయి. ఉక్రేనియా ఎనర్జీ కన్సల్టెన్సీ ఎన్కోర్ ప్రకారం.. ఉక్రేనియా భద్రతా సంస్థలు భారతదేశం నుంచి వచ్చే ప్రతి డీజిల్ దిగుమతిని రష్యా మూలమైన భాగాలను గుర్తించడానికి ప్రయోగశాల పరీక్షలు చేపట్టాలని ఆదేశించాయని కన్సల్టెన్సీ పేర్కొంది., శక్తి కన్సల్టెన్సీ ం-95 గతంలో ఈ వేసవిలో ఒక ప్రధాన ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారం మూసివేయడంతో ఇంధన వ్యాపారులు విదేశీ సరఫరాదారులపై ఆధారపడవలసి వచ్చిందని పేర్కొంది. రష్యా ముడి చమురును గణనీయమైన పరిమాణంలో శుద్ధి చేసే దేశాల్లో భారతదేశం ఒకటి. ం-95 ప్రకారం, ఉక్రెయిన్ రక్షణ మంత్రిత్వ శాఖ కూడా ఒకానొక సమయంలో భారత్ నుంచి దిగుమతి చేసుకునే డీజిల్ను సేకరించింది. ఎందుకంటే ఇది సోవియట్ అనంతర సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు గుర్తించారు.ఎన్కోర్ గణాంకాల ప్రకారం, ఒక్క ఆగస్టులోనే ఉక్రెయిన్ దేశం భారత్ నుండి 119,000 టన్నుల డీజిల్ను దిగుమతి చేసుకుంది. ఆ నెలలో మొత్తం డీజిల్ దిగుమతుల్లో ఇది 18 శాతం వాటా అని రాయిటర్స్ నివేదించింది. 2022లో రష్యా పూర్తిస్థాయి దాడిని ప్రారంభించే ముందు, పరిమిత దేశీయ ఉత్పత్తిని భర్తీ చేయడానికి ఉక్రెయిన్ బెలారస్, రష్యా నుంచి ముడి చమురు, ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధారపడింది. అయితే, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ ప్రధానంగా పశ్చిమ ఐరోపాలోని దేశాలపై ఆధార పడుతోంది. ం-95 ప్రకారం, 2025 మొదటి అర్ధభాగంలో ఉక్రెయిన్లోకి మొత్తం డీజిల్ దిగుమతులు 13 శాతం తగ్గి, 2.74 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకున్నాయి. ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారాలు, నిల్వ సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని రష్యన్ డ్రోన్ దాడులు, క్షిపణి దాడులు కొనసాగుతున్న క్రమంలో ఈ ఆంక్షలు వచ్చాయి.ఉక్రేనియా డ్రోన్లు రష్యా వాయువ్య ప్రాంతంలోని కిరిషి చమురు శుద్ధి కర్మాగారంపై ఆదివారం నాడు దాడి చేశాయి. ఇది దేశంలోనే అతి రిఫైనరీ. డ్రోన్ దాడులతో మంటలు చెలరేగాయని ఫ్రాన్స్ 24 నివేదించింది. సుర్గుట్నెఫ్టెగాజ్ లోని కిరిషినెఫ్టోర్గ్సింతేజ్ రిఫైనరీ రష్యాలోని అతిపెద్ద రెండు రిఫైనరీలలో ఒకటి. ఉక్రేనియా డోన్లు దాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని రష్యన్ అధికారులు కూడా ధృవీకరించారు. ముడిచమురు శుద్ధి కర్మాగారంపై దాడి చేసినట్లు ఉక్రెయిన్ డ్రోన్ కమాండ్ పేర్కొంది.

# ఆర్థిక బాధ్యత ఇద్దరిదీ...




కుటుంబంఆర్థికంగా బాగుండాలంటే దంపతులిద్దరూ ఒక్క మాటపై ఉండాలి. డబ్బు విషయంలో ఇద్దరి మనసులో పొదుపు చేయాలని ఉంటే, కచ్చితంగా ఆ కుటుంబానికి ఆర్థిక సమస్యలు రావు. అయితే ప్రణాళికలు ఎలా వేసుకోవాలో చాలామందికి తెలియదు. ముఖ్యంగా కొత్తగా పెండ్లయిన దంపతులకు ఈ విషయంలో అవగాహన అంతంత మాత్రమే! అలాంటి వాళ్లు కొన్ని ఆర్థికపరమైన విషయాలు తెలుసుకుంటే మంచిది. కొత్త దంపతులు పెండ్లికి ముందు తమ ఆర్థిక పరిస్థితులు ఎలా ఉండేవో చర్చించుకోవాలి. అలాగే తమ అప్పులు, ఆస్తులు, పొదుపు చేసిన డబ్బు, అలవాట్లు, ఖర్చుల గురించి ఒకరికొకరు మాట్లాడుకోవాలి.ఇద్దరూ కలిసి డబ్బుపై ఒక అభిప్రాయానికి రావాలి. దాని విలువ గురించి చర్చించుకోవాలి. తర్వాత భవిష్యత్తు కోసం కొన్నిలక్ష్యాలను పెట్టుకోవాలి. అందులో షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ గోల్స్ ఉండేలా చూసుకోవాలి. చిన్నచిన్న ఔటింగ్స్, కొత్త ఫోన్లు, కంప్యూటర్ల కొనుగోలు, ఎమర్జెన్సీ ఫండ్స్ వాటిని షార్ట్ టర్మ్ గోల్స్గా ఫిక్స్ చేసుకోవాలి. సొంతిల్లు, రిటైర్మెంట్ ప్లాన్స్ లాంటివి లాంగ్ టర్మ్ గోల్స్గా నిర్దేశించుకోవాలి. అనుకున్న లక్ష్యాలను అందుకునే దిశగా ప్రణాళికలు అమలుచేయాలి. భార్యాభర్తల మధ్య రహస్యాలు ఉండకపోవడం మంచిది. ముఖ్యంగా ఆర్థికపరమైన అంశాల్లో దాచివేతలు, దాటవేతలు భవిష్యత్తులో సమస్యాత్మకంగా పరిణమించే ప్రమాదం ఉంది. అందువల్ల ఆదాయం, పెట్టుబడి, అప్పుల విషయంలో ఇద్దరి మధ్య పారదర్శకత ఉండాలి. అప్పుడే వాళ్లలో నమ్మకం అనే బలమైన పునాది ఏర్పడుతుంది.ఆటుపోట్లు అందరికీ సహజం.

# మొన్న రష్యా ఆయిల్.. ఇప్పుడు మొక్కజొన్న..

### వాణిజ్య చర్చల వేళ భారత్పై అమెరికా ఒత్తిడి తంత్రం

న్యూఢిల్లీ, : ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలు బాంబులు విసిరిన అగ్రరాజ్యం... ఆ తర్వాత వాణిజ్య భాగస్వామ్య దేశాలతో చర్చలు జరిపి.. ఒప్పందాలు చేసుకునేలా ముందుకెళ్తోంది. కానీ, భారత్పై 25 శాతం అదనపు సుంకాలు, రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు చేసుకుంటోందన్న సాకుతో మరో 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. అయితే, ఆరో విడత చర్చలు ప్రారంభం వేళ అమెరికా మరో ఒత్తిడి తంత్రానికి తెరతీసింది.అసంపూర్తిగా నిలిచిపోయిన భారత్- అమెరికా వాణిజ్య చర్చలు పునఃప్రారంభానికి ముందు అగ్రరాజ్యం తన ఒత్తిడి తంత్రాన్ని కొనసాగిస్తోంది. అమెరికాలో పండిన గుప్పెడు మొక్కజొన్నను కూడా భారత్ కొనుగోలుచేయడం లేదని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ విమర్శించారు. తమ మొక్కజొన్నను కొనుగోలు చేయకపోతే భారత్ తమ మార్కెట్ యాక్సెస్ కోల్పోతుందని ఆక్సియోస్కి ఇచ్చిన ఇంటర్వ్యూలో లుట్నిక్ హెచ్చరించారు. అంతేకాదు, భారత్ సుంకాలను తగ్గించకపోతే 'కష్టకాలం' ఎదురవుతుందని బెదిరింపులకు దిగారు. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం భారత్పై ఒత్తిడి తగ్గించే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం.భారత్-అమెరికా సంబంధాలు వన్-వేలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. 'మాకు వస్తువులు అమ్మి వాళు ప్రయోజనం పొందుతున్నారు.. మా ఆర్థిక వ్యవస్థను వాళ్లు (భారత్) స్తంభింపజేస్తున్నారు.. వారు మా మార్కెట్లోకి ప్రవేశించి, విస్తృతంగా ప్రయోజనం పొందడానికి మేము ద్వారాలు తెరిచినప్పుడు వారు మాకు అమ్ముతారు' అని పేర్కొన్నారు.'140 కోట్ల మంది ప్రజలు ఉన్నారని చెప్పుకునే భారత్.. అమెరికాలో పండిన గంపెడు మొక్కజొన్న గింజలను ఎందుకు కొనడం లేదు? వాళ్లు మనకు అన్నీ అమ్మేస్తారు, మన మొక్కజొన్న కొనరని మనం అనుకోవడం తప్పా? వాళ్లు ప్రతిదానిపైనా సుంకాలు విధిస్తారు' అని విమర్శించారు. 'సుంకాలను తగ్గించాలని . మీ సుంకాలను తగ్గించండి, మేము మీతో ఎలా ప్రవర్తిస్తామో అలాగే మాతో కూడా వ్యవహరించండి.. అని భారత్ను అధ్యక్షుడు ట్రంప్ కోరుతున్నారు' ట్రంప్ యంత్రాంగం ఏళ్లుగా తప్పులను సరిదిద్దుకుంది... కాబట్టి మేము దీన్ని పరిష్కరించే వరకు వేరే విధంగా సుంకాన్ని కోరుకుంటున్నాం' అని ఆయన అన్నారు. 'అది అధ్యక్షుడి నమూనా, మీరు దానిని అంగీకరించాలి లేదా ప్రపంచంలోని గొప్ప వినియోగదారుడితో వ్యాపారం చేయడం మీకు కష్టమవుతుంది' అని పేర్కొన్నారు.అయితే, కొద్ది నెలలుగా భారత్-అమెరికాలు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దశలో ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతూనే.. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తుందనే సాకుతో 50 శాతం సుంకాలను విధించారు. దీంతో కొన్ని దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య కొనసాగుతోన్న బలమైన సంబంధాలు ప్రశ్నార్థకంగా మారాయి. భారత్పై తొలుత 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. తర్వాత రష్యా ఆయిల్ పేరు చెప్పి మరో 25 శాతం కలిపి 50 శాతానికి పెంచారు. బ్రెజిల్ తర్వాత అత్యధికంగా భారత్పైనే టారీఫ్లు విధించింది.రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్తో యుద్ధానికి మాస్కోకు నిధులు సమకూరుస్తోందని డొనాల్డ్ ట్రంప్, అతడి యంత్రాంగం ఆరోపిస్తోంది. అయితే, ఈ ఆరోపణలను భారత్ ఖండించింది. ట్రంప్ సుంకాలు అన్యాయమైనవి, అనవసరమైనవి, అనూహ్యమైనవిగా అభివర్ణించింది. రష్యా క్రూడ్ ఆయిల్ కొనుగోళ్లను సమర్థించుకున్న భారత్, తన ఇంధన కొనుగోలు జాతీయ ప్రయోజనాలు, మార్కెట్ పరిస్థితుల ఆధారంగా నడుస్తుందని పునరుద్ఘాటిస్తోంది.చైనాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఏడాది అమెరికా రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొకోకతప్పదని అమెరికన్ అగ్రికల్చరల్ సంస్థలు హెచ్చరించినట్టు బీబీసీ నివేదించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతోంది. దీంతో చైనా నుంచి అమెరికా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు దారుణంగా పడిపోయాయి. తత్ఫలితంగా అమెరికా రైతులు, చిన్న వ్యాపారాలు దివాళా తీశాయి. బ్లూమ్బర్గ్ జూలైలో సేకరించిన డేటా ప్రకారం, ఈ సంఖ్య ఐదేళ్ల గరిష్టానికి చేరుకుంది.వాణిజ్య చర్చలు కొనసాగుతున్నప్పటికీ టెక్నాలజీ యాక్సెస్, సుంకాలు, అరుదైన ఖనిజాల ఎగుమతుల వంటి అంశాల్లో అనే సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ వాణిజ్య చర్చలను ముందుకు తీసుకెళ్తున్న తరుణంలో అమెరికా రైతులకు ట్రంప్ యంత్రాంగం భారత్ను కొత్త మార్కెట్గా సృష్టించే ప్రయత్నం చేస్తోందని కనిపిస్తోంది.

## శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే అధిక పంట దిగుబడి సాధించొచ్చు

పెగడపల్లి(ధర్మపురి) శాస్త్రవేత్తలు సూచన లు పాటిస్తే వరి పంటలో అధిక దిగుబడి సాధించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని అయితుపల్లి గ్రామంలో "నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన అమ్ముల మల్లేశం అనే రైతు వరి పొలాన్ని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవే త్తలుసుమలత, రామకృష్ణసందర్శించి, వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలుసూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసా య అధికారి శ్రీకాంత్, ఏఈవోలుపవన్, సరోజినీ పాల్గొన్నారు.

# టారిఫ్ లతో అమెరికాకు కష్టాలు



న్యూఢిల్లీ,: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య సంబంధాలు గత కొన్ని నెలలుగా ఒక ఆసక్తికరమైన మలుపు తిరిగాయి. టారిఫ్ల బెదిరింపులు, వాణిజ్య చర్చలు, ఇండో?పసిఫిక్ భద్రతా విషయాలు మధ్య, ఈ రెండు దేశాల మధ్య సహకారం ఒక్కసారిగా ఒత్తిడికి గురైనప్పుడు, మరోవైపు క్వాడ్ వంటి వేదికల్లో పునరుద్ధరణ చెందుతున్నట్లు కనిపిస్తోంది.ట్రంప్ వాణిజ్య విధానాలు భారత్పై గట్టిగా పడిపోయాయి. రష్యన్ ఆయిల్ దిగుమతులను ఆపమని డిమాండ్ చేస్తూ, ఆగస్టు 2025లో భారత్ నుంచి అమెరికాకు వచ్చే చాలా దిగుమతులపై 50% టారిఫ్లు విధించారు. ఇది భారత వ్యాపారానికి బిలియన్ల డాలర్ల నష్టాన్ని కలిగించే అవకాశం ఉంది. ఆర్థిక విశ్లేషకుల ప్రకారం భారత జీడీపీ 0.8?1% తగ్గుతుందని అంచనా. కానీ, ఈ టారిఫ్లు అమెరికాకు కూడా వెనుకబాటు పడిపోయాయి. భారత్ నుంచి వచ్చే చౌక దిగుమతులు (ఉదా., టెక్నాలజీ, ఔషధాలు) అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైనవి. ఈ డ్యూటీలు అమెరికన్ వినియోగదారులు, చిన్న వ్యాపారాలకు ధరలు పెంచుతాయి. ట్రంప్ స్వయంగా గుర్తించినట్లు, భారత్తో వాణిజ్య ఒప్పందం చేసుకోవడం తప్పనిసరి, ఎందుకంటే టారిఫ్లు దీర్ఘకాలంలో అమెరికాకు లాభం కాకుండా, చైనా, ఇతర దేశాలకు అవకాశాలు కల్పిస్తాయి. ఇటీవలి చర్చల్లో, రెండు దేశాలు 'అసలు దూరం లేదు' అని అమెరికా అధికారులు చెప్పారు. ట్రంప్ మోదీతో ఫోన్ కాల్ చేసి, వాణిజ్య అడ్డంకులను తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది ట్రంప్ మొదటి విధానం ఓటమి కావడానికి ఒక సూచన.మోదీ స్పందన పట్టుదలతో కూడినది. బ్రిక్స్ సదస్సులో(ఆన్లైన్ మీటింగ్లో) మోదీ హాజరు కాకపోవడం ట్రంప్కు ఒక సిగ్నల్గా పనిచేసింది, ఎందుకంటే ట్రంప్ బ్రిక్స్పై కోపంగా ఉన్నారు. ఇది భారత్ను రష్యా, చైనాతో మరింత దగ్గరపడకుండా చూపించింది, అదే సమయంలో అమెరికాతో సంబంధాలను కాపాడుతూ. మోదీ ట్రంప్ను బెదిరింపులకు బదులు, బహుళ దేశాలతో (చైనా, రష్యా, బ్రెజిల్) మాట్లాడి, టారిఫ్లకు ప్రతిస్పందనగా వైవిధ్యమైన వాణిజ్య మార్గాలు వెతికారు. ఈ వ్యూహం పనిచేసింది. ట్రంప్ మొదట భారత్ను 'టారిఫ్ కింగ్'గా విమర్శించారు, కానీ ఇప్పుడు మోదీని 'మంచి స్నేహితుడు'గా పిలుస్తున్నారు. భారత్ రష్యన్ ఆయిల్ దిగుమతులను కొంచెం తగ్గించినప్పటికీ, పూర్తిగా ఆపలేదు. ఇక మోదీ చాణక్య నీతి ? ఒత్తిడిని ఉపయోగించుకుని స్వేచ్ఛను కాపాడటం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. ఫలితంగా, ట్రంప్ భారత్ను కోల్పోవద్దని గుర్తించారు, ఎందుకంటే భారత్ లేకుండా ఇండో?పసిఫిక్ వ్యూహం బలహీనమవుతుంది.క్వాడ్ (భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా) ఇండో పసిఫిక్ భద్రతకు కీలకం. 2025 చివరిలో భారత్లో జరిగే సమావేశానికి మొదట ట్రంప్ రాకపోవచ్చని అంచనా వచ్చింది, టారిఫ్ టెన్షన్ల కారణంగా. కానీ, ఇటీవలి అభివృద్ధి ఆశావాదాన్ని ఇస్తోంది. అమెరికా అధికారులు ట్రంప్ వస్తారని నిర్ధారించారు, మోదీతో ఫోన్ కాల్ జరిగే అవకాశం ఉంది. ఇక్కడ ముఖ్యమైనది సెనేట్ కన్ఫర్మేషన్ హియరింగ్లో అమెరికా రాయబారి అభ్యర్థి సెర్జియో గోర్ వ్యాఖ్యలు. ఆయన చెప్పినట్లు, 'క్వాడ్ చాలా ముఖ్యం, ట్రంప్ దీనికి పూర్తి కమిట్మెంట్ చూపిస్తారు.' ఇది ట్రంప్ స్వర మార్పును సూచిస్తుంది. మొదట భారత్ను ఉపేక్షించాలని భావించారు, కానీ ఇప్పుడు చైనాను అదుపు చేయడానికి భారత్ అవసరమని గుర్తించారు. వియత్నాం లేదా కొరియా వంటి దేశాలు చైనా ఆధిపత్యాన్ని సవాలు చేయలేవు, కానీ భారత్ ఉన్న క్వాడ్ బలమైనది. టారిఫ్లు భారత్ను బెదరపరచలేదు, అమెరికా భారత్ను కోల్పోతే చైనాకు లాభం.మొత్తంగా, ఈ సంఘటనలు అమెరి కా భారతసంబంధాల్లో మార్పును చూపిస్తాయి. ట్రంప్ మొదట బెదిరింపులతోముందుకు వెళ్లారు, కానీ భారత్ దౌత్యం?మోదీ యొక్క పట్టుదల మరియు వ్యూహం ? దాన్ని తిప్పికొట్టింది. టారిఫ్లు భారత్కు నష్టం కలిగించినప్పటికీ, అవి అమెరికాకు ఎక్కువ హాని చేశాయి. క్వాడ్ వంటి వేదికలు భారత్ స్థానాన్ని బలోపేతం చేశాయి.

# నల్ల జీలకర్రలో అనేక లాభాలు..!




జీలకర్రను మనం ఎప్పటి నుంచో వంట ఇంటి పోపు దినుసుగా ఉపయోగిస్తున్నాం. జీలకర్రను నిత్యం అనేక వంటల్లో వేస్తుంటారు. జీలకర్రను కూరల్లో వేస్తే కూరలు చక్కని వాసన వస్తాయి. రుచిగా కూడా ఉంటాయి. అయితే జీలకర్రలో మరో రకం జీలకర్ర కూడా ఉంటుంది. అదే నల్ల జీలకర్ర. దీన్ని చాలా మంది చూసి ఉండరు. కానీ నల్ల జీలకర్రను కూడా మనం ఉపయోగించవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. నల్ల జీలకర్రను ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు ఒక కప్పు మోతాదులో ఉదయం తాగుతుండాలి. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. నల్ల జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ వీటిల్లో సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తుంది. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.

కీళ్ల నొప్పులు, వాపులకు..: నల్ల జీలకర్రలో అధికంగా ఉండే థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటుంది. అందువల్ల ఈ జీలకర్రను వేసి మరిగించిన నీళ్లను రోజూ సేవిస్తుంటే కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. నల్ల జీలకర్రలో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు ఉంటాయి. అంటే దీన్ని తీసుకుంటే రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. నల్ల జీలకర్రలో ఉండే సమ్మేళనాలు ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ సమస్యలను తగ్గించేందుకు ఎంతగానో దోహదం చేస్తాయి. నల్ల జీలకర్రను తీసుకుంటే అలర్జీలను సైతం తగ్గించుకోవచ్చు. శ్వాస నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోయి గాలి సరిగ్గా లభిస్తుంది. ఊపిరి సరిగ్గా పీల్చుకుంటారు.

షుగర్ ఉన్నవారికి..: అధ్యయనాలు చెబుతున్న ప్రకారం నల్ల జీలకర్ర ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి నల్ల జీలకర్ర ఎంతగానో మేలు చేస్తుంది. డయాబెటిస్ ను అదుపులో ఉంచుకోవచ్చు. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం నల్ల జీలకర్రను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతోపాటు ట్రై గ్లిజరైడ్స్ కూడా తగ్గుతాయి. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు.

క్యాన్సర్ కణాలకు ఔషధం..: నల్ల జీలకర్రలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకుంటాయి. దీంతో క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. సైంటిస్టులు జంతువులపై చేసిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. నల్ల జీలకర్ర నుంచి తీసిన నూనె కూడా మనకు లభిస్తుంది. దీన్ని వాడడం వల్ల అనేక చర్మ సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా మొటిమలు, గజ్జి, తామర, దురద, సోరియాసిస్ వంటి సమస్యలకు ఈ నూనెచక్కగా పనిచేస్తుంది. గాయాలు,పుండ్లను త్వరగా మానేలా కూడా చేస్తుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం నల్ల జీలకర్ర నూనె జుట్టు పెరుగుదలను కూడా ప్రోత్సహిస్తుంది. శిరోజాలకు దీన్ని రాస్తుంటే ఎంతగానో మేలు జరుగుతుంది. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా మారుతాయి. ఇలా నల్ల జీలకర్రను వాడితే అనేక లాభాలను పొందవచ్చు.

# గుండెపోటుకు చెక్ పెట్టే ఈ ఫుడ్ ఐటమ్స్ గురించి మీకు తెలుసా..?



ఈ మధ్యకాలంలో గుండెపోటు మరణాలు పెరిగిపోతున్నాయి. చిన్నాపెద్దా, ఆడామగ తేడా లేకుండా గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయి. నిత్యం కసరత్తులు చేసి ఫిట్‌గా ఉండే క్రీడాకారులు, ఎలాంటి గుండె జబ్బుల ఆనవాళ్లు లేని ఆరోగ్యవంతులు కూడా అకస్మాత్తుగా వచ్చే హార్ట్ ఎటాక్‌లతో, కార్డియక్ అరెస్ట్‌లతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి ఆకస్మిక గుండె రుగ్మతలకు చెక్‌పెట్టేందుకు కొన్ని ఆహార పదార్థాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం..

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉత్తమమైన ఆహార పదార్థాలు చేపలు, గుడ్లు. ఈ రెండింటిలోనూ ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. మీరు శాఖాహారులైతే చేపలు, గుడ్లకు బదులుగా డ్రై ఫ్రూట్స్ తినవచ్చు. డ్రై ఫ్రూట్స్‌లో కూడా ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులను నివారిస్తాయి. పప్పుధాన్యాలు, బీన్స్‌ను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇవి శరీరానికి పుష్కలంగా ప్రోటీన్‌ను అందించడంతోపాటు గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో తోడ్పడుతాయి. అదేవిధంగా సిట్రస్ జాతి పండ్లలో కూడా గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే అనేక పోషకాలు ఉంటాయి. సిట్రస్ పండ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. దాంతో ఆకస్మిక గుండెపోట్లు, కార్డియాక్ అరెస్ట్‌ల వంటివి జరగకుండా ఉంటాయి.

# కాలానికి తగ్గట్టే..

ఆహార అలవాట్లను కూడా.. కాలానికి తగ్గట్టుగా మార్చుకోవాలి. ఇష్టమైన వంటకమైనా.. సీజన్‌కు సెట్‌కాకుంటే పక్కన పెట్టేయాలి. లేదంటే, ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ముఖ్యంగా, వేసవిలో కొన్ని కూరగాయలతో అనారోగ్యం పొంచి ఉంటుంది. కాబట్టి, ఎండకాలంలో ఏయే కూరగాయలు, వంటకాలు తినకూడదో తెలుసుకుంటే మంచిది. వంకాయ.. కూరగాయల్లో రారాజుగా పేరు. కానీ, వేసవిలో మాత్రం ఆరోగ్యానికి శత్రువు. వంకాయను వేడి కూరగాయగా చెబుతారు నిపుణులు. వేసవిలో దీన్ని తినడం వల్ల జీర్ణవ్యవస్థను బలహీనపరుస్తుంది. మలబద్ధకం, గ్యాస్ వంటి పొట్ట సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కొందరిలో అలెర్జీలు కూడా రావొచ్చు. ఆరోగ్యానికి ఎంతో మేలుచేసే కాలీఫ్లవర్.. ఎండల్లో శరీరానికి హాని కలిగిస్తుంది. ఇందులో అధిక మొత్తంలో సల్ఫర్ ఉంటుంది. ఇది శరీరంలో వేడిని పెంచుతుంది. ఎసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలకూ దారితీస్తుంది.

మూత్రపిండాల సమస్యలు, రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువగా ఉన్నవారు వేసవిలో చేమదుంపలను తినకూడదని నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఆగ్జాలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది మూత్రపిండాల పని తీరుపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా, వేసవిలో డీహైడ్రేషన్ వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. అలాంటి కాలంలో చేమదుంపలు తింటే.. కిడ్నీలకు మరింత హాని కలుగుతుంది. మాంసం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో, జీర్ణవ్యవస్థపై అధిక ఒత్తిడి పడుతుంది. ఇక



శరీరం వేడిగా ఉండే వేసవిలో మటన్ వంటకాలు తింటే.. శరీర ఉష్ణోగ్రత మరింతగా పెరుగుతుంది. కాబట్టి, వేసవిలో మాంసాహారాన్ని తగ్గించుకోవడం మంచిది. ఇక వేడివేడి కాఫీలు, టీలను కూడా తగ్గించాలి. ఇవి శరీర ఉష్ణోగ్రతను అమాంతం పెంచేసి, మరింత అసౌకర్యాన్ని కలిగిస్తాయి. వీటికి బదులుగా మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లను ఎంచుకుంటే బెటర్! వేసవి అంటేనే.. పచ్చళ్ల సీజన్. ముఖ్యంగా ప్రతి ఇంట్లోనూ మామిడికాయలతో పచ్చళ్లు పెట్టుకుంటారు. కానీ, ఈ కాలంలో వీటికి దూరంగా ఉండటమే మంచిది. పచ్చళ్లలో ఉప్పు, నూనె అధికంగా వాడతారు. ఉప్పు అధికంగా తీసుకుంటే.. శరీరం త్వరగా నీటిని కోల్పోతుంది. ఇది డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. ఇక, అధిక నూనె కూడా వేసవిలో అనారోగ్యానికి కారణమవుతుంది.

# నిమ్మ ఆకులను ఎలా ఉపయోగించాలంటే..

## ఈ ఇంటి చిట్కాలను పాటించండి..!



నిమ్మకాయల వల్ల మనకు ఎన్ని అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. నిమ్మరసాన్ని చాలా మంది వేసవిలో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దీని వల్ల శరీరంలో ఉన్న వేడి తగ్గుతుంది. నిమ్మకాయల్లోని రసంలో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా వ్యాధులను దరి చేరకుండా చేస్తుంది. చర్మాన్ని సంరక్షిస్తుంది. అయితే నిమ్మకాయలు మాత్రమే కాదు, నిమ్మ చెట్టు ఆకులు కూడా మనకు ఎంతగానో ఉపయోగపడతాయి. నిమ్మ ఆకులను ఉపయోగించి అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. నిమ్మ ఆకుల్లో సిట్రిక్ యాసిడ్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవన్నీ మనకు రోగాలు రాకుండా చూస్తాయి. ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి.

నిద్రలేమి సమస్యకు..: నిమ్మ ఆకులను కొన్ని తీసుకుని కొద్దిగా నలిపి నీటిలో వేసి మరిగించాలి. 10 నిమిషాలు మరిగాక స్టవ్‌ను ఆఫ్ చేసి నీళ్లను వడకట్టి ఆ నీళ్లు గోరు వెచ్చగా ఉండగానే కొద్దిగా తేనె కలిపి తాగేయాలి. ఈ నీళ్లను తాగుతుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుం ది. రాత్రి పూట ఈ నీళ్లను తాగితే మనస్సుకు విశ్రాంతి కలిగి నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. ఈ నీళ్లను సేవించడం వల్ల జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. అసిడిటీ సమస్య ఉన్నవారు మాత్రం ఈ నీళ్లను సేవించకూడదు. నిమ్మ ఆకులను కొన్ని తీసుకుని కొద్దిగా నలిపి చర్మం కనిపించే ప్రాంతాల్లో రాయాలి. దీంతో దోమలు దూరంగా పోతాయి. అలాగే ఇంట్లో కిటికీలు, తలుపులు, ఇతర ప్రదేశాల్లో నిమ్మ ఆకులను నలిపి చిన్నపాటి గిన్నెలో ఉంచితే ఈగలు, పురుగులు, బొద్దింకలు రాకుండా అడ్డుకోవచ్చు.

చర్మ సంరక్షణకు..: నిమ్మ ఆకులను కొద్దిగా నలిపి నీటిలో వేసి బాగా కలిపి ఆ నీళ్లతో స్నానం చేయాలి. దీంతో చెమట వాసన రాదు. దుర్వాసన రాకుండా అడ్డుకోవచ్చు. శరీరం చక్కని వాసనను అందిస్తుంది. ఇది మనస్సును కూడా రిలాక్స్ అయ్యేలా చేస్తుంది. అలాగే చర్మం సంరక్షించబడుతుంది. చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు పోయి కాంతివంతంగా మారుతుంది. చర్మం మెరుస్తుంది. సహజసిద్ధమైన నిగారింపును పొందుతుంది. కొన్ని నిమ్మ ఆకులను నీటిలో వేసిమరిగించాలి. ఆ నీళ్లను సగం బకెట్ గోరు వెచ్చని నీటిలో పోసి కలపాలి. అనంతరం ఆ బకెట్‌లో పాదాలను మునిగేలా 15 నిమిషాల పాటుఉంచాలి. ఇలాచేస్తుంటే పాదాలకండరాలకు ప్రశాంత త లభిస్తుంది. పాదాలు, కాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.


సహజసిద్ధమైన రిఫ్రెషనర్‌గా..: నిమ్మ ఆకులను సహజసిద్ధమైన రిఫ్రెషనర్‌గా కూడా ఉపయోగించవచ్చు. నిమ్మ ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను సేకరించి ఒక స్ప్రే బాటిల్‌లో పోసి ఉపయోగించాలి. ఇంట్లో దుర్వాసన వస్తున్న చోట్లలో ఈ నీళ్లను స్ప్రే చేయాలి. దీంతో వాసన పోతుంది. రూమ్ అంతా పరిమళంతో నిండిపోతుంది. నిమ్మ ఆకులను బాగా నూరి మెత్తని పేస్టులా చేసి అందులో కాస్త తేనె, పెరుగు వేసి కలిపి ఫేస్ ప్యాక్‌లా తయారు చేయాలి. దీన్ని ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖంపై ఉండే మృత చర్మ కణాలు తొలగిపోతాయి. ముఖంపైఉండే ముడతలు, మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. ముఖం మృదువుగా మారుతుంది. చర్మంపై అలర్జీలు వచ్చే వారు ముందుగా ప్యాచ్ టెస్ట్ చేసి ఈ చిట్కాను ఉపయోగించాలి. నిమ్మ ఆకులను పేస్ట్‌లా చేసి అందులో పెరుగు కలిపి జుట్టుకు పట్టించి కాసేపు అయ్యాక తలస్నానం చేయాలి. ఇలా చేస్తుంటే చుండ్రు పోతుంది. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. ఇలా నిమ్మ ఆకులతో మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# కాఫీకీ ఓ టైముంది

కాఫీ తాగడం.. ఆరోగ్యానికి మంచిదే! కానీ, ఎప్పుడు తాగుతున్నాం? ఎంత తాగుతున్నాం? అనేది కూడా ముఖ్యమని అంటున్నారు అమెరికా పరిశోధకులు. గుండె, శరీరం మీద కెఫీన్, కాఫీ తాగే సమయం చూపించే ప్రభావాలపై ఓ పరిశోధన జరిగింది. అమెరికా నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేషన్ సంస్థ.. దాదాపు పదేండ్లపాటు ఈ అధ్యయనం నిర్వహించింది. ఇందులో పాల్గొన్నవారు రోజుకు కనీసం ఒక్కసారైనా తీసుకునే ఆహారం, పానీయాలను క్షుణ్నంగా పరిశీలించింది. సర్వే సమయంలో సంభవించిన మరణాలను, వాటి కారణాలను నమోదు చేసింది. ఆయా డేటాలను విశ్లేషించి.. ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. వీరిలో 52 శాతం మందికి కాఫీ తాగే అలవాటు ఉంది. అందులోనూ 36 శాతం మంది ఉదయం మాత్రమే కాఫీ తాగుతుండగా.. మిగిలిన 16 శాతం మంది రోజులో అనేకసార్లు కాఫీ తాగుతారని చెప్పారు. అయితే, కాఫీ తాగనివారితో పోలిస్తే.. ఉదయంపూట కాఫీ తాగేవారికి ఏ కారణంతోనైనా మరణం సంభవించే ముప్పు 16 శాతం, గుండెజబ్బుతో మరణించే ముప్పు 31 శాతం తక్కువగా ఉంటున్నట్టు తేలింది. అయితే, రోజంతా రెండుమూడు సార్లు కాఫీ తాగేవారిలో ఇలాంటి ప్రయోజనాలేవీ కనిపించలేదని పరిశోధకులు వెల్లడించారు. మధ్యాహ్నం, సాయంత్రం కాఫీ తాగేవారిలో జీవ



గడియారం క్రమం తప్పుతుందనీ, మెలటోనిన్ వంటి హార్మోన్ల మోతాదులు అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఫలితంగా ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీసి.. రక్తపోటు, గుండెజబ్బు ముప్పు పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.



# బత్తాయి పండ్లను లైట్ తీసుకోకండి..

## ఇవి మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు..

బత్తాయి పండ్లు.. చూసేందుకు అచ్చం నారింజ పండ్లలాగే ఉంటాయి. కానీ నారింజ పండ్లంత తియ్యగా ఉండవు. మరీ పుల్లగా కూడా ఉండవు. కానీ ఇవి రుచిగా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. చాలా మంది రహదారుల పక్కన ఉండే జ్యూస్ సెంటర్లలో బత్తాయి రసం తాగేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఈ పండ్లు కాస్త తీపి, పులుపు రుచి కలిగి ఉంటాయి. చూసేందుకు పెద్ద నిమ్మ పండు సైజులో ఉంటాయి. బత్తాయి పండ్లనే స్వీట్ లైమ్ అని కూడా పిలుస్తారు. ఈ పండ్ల గుజ్జు లేత పసుపు రంగులో ఉంటుంది. బత్తాయి పండ్లను చాలా మంది నేరుగా తింటారు. కానీ ఈ పండ్లను జ్యూస్‌గా తాగితేనే చాలా బాగుంటుంది. బత్తాయి పండ్ల రసాన్ని చాలా మంది ఇష్టంగా తాగుతారు. బత్తాయి పండ్లను తింటున్నా లేదా జ్యూస్‌ను తాగుతున్నా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

నోటి దుర్వాసనకు చెక్..: బత్తాయి పండ్లలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. జలుబు, జ్వరం వచ్చినప్పుడు రోజుకు 2 సార్లు ఈ పండ్ల జ్యూస్‌ను తాగాలి. దీంతో త్వరగా కోలుకుంటారు. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. శరీరం కోల్పోయిన ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు. నీరసం, అలసట తగ్గుతాయి. చురుగ్గా మారుతారు. బత్తాయి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది దంతాలు, చిగుళ్లను దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. బత్తాయి పండ్లను తింటే నోట్లో లాలా జలం అధికంగా స్రవించబడుతుంది. ఇది మనం తిన్న ఆహారాన్ని సులభంగా, త్వరగా జీర్ణం చేస్తుంది. దీంతో అజీర్తి, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు.

మలబద్ధకం ఉండదు..: బత్తాయి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే మలబద్ధకం తగ్గుతుంది. రోజూ ఉదయం సుఖ విరేచనం అవుతుంది. బత్తాయి పండ్లలో ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి జీర్ణ రసాలు, ఆమ్లాలు విడుదల అయ్యేందుకు సహాయం చేస్తాయి. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది.

ఏదైనా వ్యాధి వచ్చిన వారు బత్తాయి పండ్ల రసాన్ని సేవిస్తుంటే త్వరగాశక్తి లభించి రోగం నుంచి త్వరగా కోలుకుంటారు. ఉదయం జాగింగ్ లేదా వాకింగ్, యోగా, వ్యాయామం చేసిన అనంతరం ఒక గ్లాస్ బత్తాయి పండ్ల రసం సేవిస్తే శరీరానికి వెంటనే శక్తి లభిస్తుంది. మళ్లీ ఉత్సాహంగా మారుతారు. రోజంతటికీ కావల్సిన శక్తి లభిస్తుంది. ఎంత పనిచేసినా నీరసం, అలసట రావు. బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా టీ, కాఫీ వంటివి తాగకుండా బత్తాయి పండ్ల రసం తాగితే ఎంతో మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

విరేచనాల నుంచి ఉపశమనం..: బత్తాయి పండ్లలో ఉండే ఆమ్లాలు జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లను బయటకు పంపుతాయి. దీంతో జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. అజీర్తితో బాధపడేవారికి బత్తాయి రసం ఔషధంగా పనిచేస్తుంది. బత్తాయి పండ్లలో ఉండే పొటాషియంవిరేచనాలను తగ్గిస్తుంది. బాధితులు త్వరగా కోలుకునేలా చేస్తుంది. కామెర్లు వచ్చిన వారు ఈ పండ్ల రసం తాగుతుంటే త్వరగా కోలుకుంటారు. వాంతులు, తలతిరగడం వంటి సమస్యలు ఉన్నవారు బత్తాయి పండ్ల రసం తాగితే మంచిది. గొంతు సంబంధ ఇన్‌ఫెక్షన్లు ఉన్నవారు బత్తాయి రసం తాగితే త్వరగా ఉపశమనం లభిస్తుంది. రోజూ ఈ జ్యూస్‌ను సేవించడం వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. బ్లడ్ క్లాట్స్ కరిగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఇలా బత్తాయి పండ్లు మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు. కనుక ఇవి కనబడితే విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి.

# హాలీవుడ్‌లో కూడా వివక్ష!



అగ్ర కథానాయిక దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. భారతీయ నటీనటుల పట్ల అక్కడి వారు వివక్ష చూపిస్తుంటారని, అది అందరికీ తెలిసిన విషయమే అని పేర్కొంది. భారతీయ సినిమాలో తిరుగులేని గుర్తింపును దక్కించుకున్న ఈ మంగళూరు సోయగం హాలీవుడ్‌లో కూడా సత్తా చాటుతున్నది. 'ట్రిబుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ గ్జాండర్ కేజ్' వంటి చిత్రాలతో పాటు పలు అంతర్జాతీయ ఉత్పత్తులకు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ గ్లోబల్ ఐకాన్‌గా పేరు తెచ్చుకుంది. ఓ ఇంటర్నేషనల్ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీ గురించి మాట్లాడింది. 'అందరూ అనుకుంటున్నట్లుగా హాలీవుడ్‌లో ప్రతిదీ నిజాయితీగా, సక్రమంగా ఏమీ ఉండదు. భారతీయ నటీనటులు అక్కడ వివక్షను ఎదుర్కొం టారు. ముఖ్యంగా శరీర రంగు ఆధారంగా వివక్ష చూపిస్తుంటారు. ఉద్దేశ్యపూర్వకంగా అలాంటివి జరుగుతుంటాయి. స్కిన్ కలర్‌తో పాటు మన ఇంగ్లీష్ యాసపై కూడా అక్కడ చిన్నచూపు ఉంటుంది. అందుకే హాలీవుడ్‌లో అవకాశాలు దక్కించుకొని సక్సెస్ కావడం అంత సులభం కాదు. అయితే ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా సరే ఓ భారతీయురాలిగా నా గొంతును బలంగా వినిపించే ప్రయత్నం చేస్తుంటా. నా మూలాలను గౌరవించే వారితోనే పనిచేస్తానని నిక్కచ్చిగా చెబుతాను' అని దీపికా పదుకొణె పేర్కొంది. 'స్పిరిట్' 'కల్కి' వంటి పాన్ ఇండియా తెలుగు చిత్రాల నుంచి దీపికా పదుకొణె తొలగింపు వ్యవహారం జాతీయ స్థాయిలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీపికా పదుకొణె ప్రస్తుతం బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాలపై దృష్టి పెడుతున్నది.

# కల నెరవేరింది



'పెద్ది' ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియా సన్సేషన్‌గా మారింది. మొత్తం 13 దేశాల్లో టాప్ ట్రెండింగ్‌లో ఈ పాట ఉందని, నాలుగు భాషల్లో కలిపి 53 మినియన్ ప్లస్ వ్యూస్‌ని ఈ పాట సాధించిందని, టాప్ చార్ట్స్‌లో నంబర్ వన్ స్థానంలో ఉందని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలావుంటే.. శనివారం రాత్రి హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఏ.ఆర్.రెహమాన్ మ్యూజికల్ నైట్ జరిగింది. ఈ కార్యక్రమంలో అగ్ర హీరో రామ్‌చరణ్ సందడి చేశారు. ఆయనతోపాటు కథానాయిక జాన్వీకపూర్, 'పెద్ది' దర్శకుడు బుచ్చిబాబు సానా కూడా హాజరై ఆడియన్స్‌లో మరింత జోష్ నింపారు. 'పెద్ది' సినిమాలోని 'చికిరి చికిరి' సాంగ్ లైవ్ పెర్ఫార్మెన్స్ ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'రెహ్మాన్‌సార్ సంగీతంతో భాగమవ్వాలనేది నా చిన్ననాటి కల. అది నా 'పెద్ది' సినిమాతో నెరవేరినందుకు చెప్పలేనంత సంబరంగా ఉంది.' అని ఆనందం వెలిబుచ్చారు. 'పెద్ది' ఒక డిఫరెంట్, యూనిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా అని జాన్వీ కపూర్ అన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది.

# తుది దశ చిత్రీకరణలో పెద్ది



రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ సమర్పిస్తున్నది. ఈ సినిమాకు సంబంధించి తాజా అప్‌డేట్ వెలువడింది. నేటి నుంచి హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభమవుతున్నది. ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. జనవరి నెలాఖరు వరకు జరిగే ఈ షెడ్యూల్‌తో టాకీ పార్ట్ మొత్తం పూర్తవుతుందని మేకర్స్ తెలిపారు. ఓ వైపు షూటింగ్‌తో పాటు పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాల్ని కూడా సమాంతరంగా నిర్వహిస్తున్నామని చిత్రబృందం పేర్కొంది.ఈ చిత్రంలో రామ్‌చరణ్ అన్ని ఆటల్లో ప్రావీణ్యం కలిగిన ఆటకూలీ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచారచిత్రాలకు మంచి స్పందన లభించడంతో ఈ సినిమా కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. జాన్వీ కపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సానా.

# సినిమా..

## ఆకట్టుకుంటున్న విజయ్ తనయుడు డెబ్యూ మూవీ..



టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరోసారి పవర్ ప్యాక్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అయితే ఈ సినిమాతోనే తమిళ స్టార్ విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇప్పటికే షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, తాజాగా చిత్ర బృందం టైటిల్ మరియు ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. సినిమా టైటిల్‌ను 'సిగ్మా (SIGMA)'గా ఫిక్స్‌చేశారు. విడుదలచేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ బంగారం, నగదు కట్టలపై చేతికి కట్టు కట్టుకుని సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లల్లో కనిపిస్తున్న యాంగర్, ఇంటెన్సిటీ ఈ మూవీ టోన్‌ను స్పష్టంగా చెబుతోంది. సందీప్ ఇప్పటివరకు చేసిన రోల్స్ కంటే భిన్నంగా, ఈసారి పూర్తి స్థాయి యాక్షన్ ప్యాక్డ్ అవతారంలో కనిపించనున్నారు. ఫ్యాన్స్ ఈ లుక్‌పై ఫిదా అవుతున్నారు. సమాచారం ప్రకారం, సిగ్మా ఒక ట్రెజర్ హంట్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. సస్పెన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ మూవీ విజువల్‌గా గ్రాండ్‌గా ఉండబోతోందని చిత్ర బృందం చెబుతోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. తమిళ స్టార్ దళపతి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తుండటం మరింత స్పెషల్. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్,విజువల్స్ విషయంలో ఆయన చూపుతున్నప్రత్యేక దృష్టి సినీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. తొలి సినిమానే పాన్ ఇండియా రేంజ్‌లో ప్లాన్ చేయడం ద్వారా ఆయన సీరియస్ ఫిల్మ్‌మేకర్‌గా కనిపిస్తున్నారు. 'మైఖేల్', 'టెనెట్' తరహాలో ఆ యాక్షన్-ఇంటెన్స్ జానర్‌లో సిగ్మా సినిమా సందీప్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవబోతుందని ట్రేడ్ సర్కిల్స్ అభిప్రాయం. "When Greed Meets Guts" అనే ట్యాగ్‌లైన్ పోస్టర్‌లో కనిపించడం సినిమాపై ఆసక్తి మరింత పెంచింది. సందీప్ కిషన్ - జాసన్ సంజయ్ కాంబినేషన్‌లో వస్తున్న 'సిగ్మా' త్వరలోనే థియేటర్స్‌లో సందడి చేయబోతోంది. ట్రెజర్ హంట్, హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషన్ కలగలిపిన ఈ మూవీ 2025లో టాలీవుడ్‌లో బిగ్ బ్లాస్టర్ అవ్వడం ఖాయం అని సినీ వర్గాలు చెబుతున్నాయి!

## వర్తమాన అకృత్యాలపై రాజేసిన కొలిమి..!



ఇటీవల గొప్ప సామాజిక కవిత్వం రాస్తున్న వారిలో పతివాడ నాస్తిక్ ఒకరు. ఆయన వెలువరించిన కవితా సంపుటి 'కొలిమి రాజేయ్యాల్సిందే' వర్తమాన సమాజానికి అవసరమైన స్వరం. ఈ మండే తన మనసు కొలిమినుంచి అక్షరాలను ఏరుకుంటాడు. వాటిని బాణాల్లా మార్చి సంధించటానికి విల్లును ఎక్కుపెట్టినప్పుడు ఇంక్విలాబ్ జిందా బాద్ నినాదాలు తప్ప, మరే మాటలు అతనికి వినిపించవు. చీకటి బజార్లో ముంచెత్తుతున్న దోపిడీ వాయుగుండాల వరద బీభత్సాన్ని మాత్రమే అతడు చూడగలుగుతాడు. తన చేతిలోని విల్లు తాడును లాగినప్పుడల్లా చెమట సంపద కొట్టుకుపోయి, దిక్కుతోచని

దీనస్థితిలో వున్న బడుగు బతుక్కి భరోసా నిచ్చే ఒక శబ్దాన్ని కమ్యూనిజం వేదికగా ఈ కవి అందిస్తున్నాడు. కష్టజీవులంతా ఎర్ర సముద్రపు తరంగాల హెూరులో కలిసి ఉద్యమించే రోజు వస్తుందని తన నమ్మకాన్ని ఒక జెండాలా అక్షరాల సాక్షిగా ఎగురవేస్తున్నాడు. కడుపులో లుంగచుట్టుకు పోతున్న పేగుల్ని తెంచుకొని పుట్టే పిడికిళ్లను గురించి చెబుతూ 'అవి మీ కంచాల మీద కలబడి/ మీ గోడౌన్ల మీదికి ఎగబడి/ మీ కొంపల్ని నేలమట్టం చేస్తాయి' అంటూ దోపిడీ వర్గాలకు పదునైప హెచ్చరికల్ని జారీచేస్తున్నాడు ఈ కవి.

నిబద్ధత కలిగిన కవుల వరుసల్లో సముచిత స్థానాన్ని అందుకున్న పతివాడ నాస్తిక్, వర్తమానంలో దిశా నిర్దేశాలు లేని కవులపట్ల తన నిరసనను తీవ్రమైన స్థాయిలోనే వ్యక్తం చేస్తున్నాడు. కష్టజీవుల కన్నీళ్ల తడిస్పర్శ అంటే ఏమిటో అర్థం కాకుండానే- పేదల ఆకలి మీద అలవోకగా కవిత్వాన్ని రాసే కవులందర్నీ ఒకచోట సమావేశపరిచి 'నువ్వు మురికివాడల్లోని/ ఇరుకు గుడిసెల్లోకి/ కష్టజీవుల్లోని/ చెమట చుక్కల్లోకి/ ప్రయాణించటం మొదలుపెట్టు/ అప్పుడు నువ్వు/ ఆకలిగొన్న చంటిబిడ్డకు/ అమ్మ కలిపిన పాలబువ్వలా/ కమ్మ కమ్మగా పరిమళిస్తావ్%ొ%' అంటూ ఉద్బోధిస్తున్నాడు. ఈ మాటల్ని వర్తమాన కవులు చాలామంది జీర్ణించుకొని, వాటిని పాఠాలుగా స్వీకరించి ప్రజాకవులుగా మిగిలిపోవాలని ఆశిస్తున్నాడు.

వానలు, వరదలు ముంచెత్తి, కొంపా గూడూ నాశనమై పోయి, కన్నీళ్లతో ఓదార్చుకుంటూ, కలిసి కలో గంజో సర్దుకుని పంచు కుంటు న్న ఎర్రకలువల పక్కన నిలబడి, వాళ్ల హదయ స్పందనను ఆసక్తిగా కవి వినిపిస్తున్నాడు. వాళ్ల కళ్లను వాళ్ల వేళ్లతోనే పొడిపించుకునేలా చేసిన నయావంచకులను ఎదురుగా నిలబెట్టి, గతంలో వాళ్లు చేసిన నిర్వాహకాలన్నింటినీ ఏకరువు పెడుతూ, కనురెప్పల మధ్య కోపాన్ని నిప్పుల్లా కురిపిస్తూ, పిడుగుల్లా మాటల్ని సంధిస్తూ 'చూడు../ నూటాయాభై కోట్ల బిందువులతో/ నిండిన ఈ సుందర సరోవరంలో/ ఎలుగెత్తే చైతన్యం వెల్లువలా లేస్తుంది/ ఎర్రని కలువలు పూసే/ మంచికాలం/ తప్పక నీ అంతు తేలుస్తుంది' అంటూ రేపటి కాలం మాత్రం మాదేనంటూ గర్జిస్తున్నాడు.

ఇది కష్టజీవుల చెమట వాసనతో పరిమళిస్తున్న కవిత్వం. రాజ్యం వెన్నులో వణుకు పుట్టించి, చట్టం కన్ను తెరిపించి, పేరుకున్న కుట్రల ముళ్ళ డొంకల్ని నరికివేసి, రేపటి ఉదయానికి కష్టాలు, కన్నీళ్ల పట్ల, వాళ్లుఎదుర్కొంటున్న దోపిడీ మూలాల పట్ల ఈ కవికిసమగ్రమైన అవగాహనవుది. ఆయన కవిత్వంలో తొందరపాటు లేని అర్థవంతమైన ఆలోచనలవరుసలు మనతో కరచాలనం చేయటం విశేషం. తన కవిత్వం ద్వారా పూర్తి విశ్వాసాన్ని పొందగలిగిన స్థాయిలో నిలబడి, అద్భుత భావజాల సమ్మిళితంతో, గొప్ప సజనాత్మక అనుభవాలను జోడించిన ఈ కవి, ఇజ్రాయిల్ చాలా పాశవికంగా పాలస్తీనా దేశంపై విరుచుకుపడుతున్న దాడిని తీవ్రమైన స్వరంతో ఖండిస్తూ 'నువ్వు ఎంత గట్టిగా కొడితే/అంతగట్టిగా పైకి లేచి/ నరాలనిండా నెత్తుటి చైతన్యపు/ గాలితరం గాల్ని వెంటబెట్టుకొని/ చెక్కుచెదరని స్థైర్యంతో/ నిద్ర పోతున్న దిక్కుల/ గుండెలమీద గుద్ది మరీ/ మేల్కొపగల పాలస్తీనా/ పాలబుగ్గల తోలుబంతిని%ొ%' అంటూ తన కవితను దండోరా చేసి అందించిన శబ్దం, అక్షరాల తలపాగాలతో ఎప్పటికీ మనకు వినిపిస్తూనే వుంటుంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215